

మెరుపు తీగ

మేఘావృతమైన ఆకాశం. ఉరుముల శబ్దం. కళ్లు బైర్లుకమ్మేలా మెరుపులు. పిడుగులు పడతాయేమోనన్న ఆందోళన. చివరకు చినుకు పడలేదు. ఆ మెరుపుల మధ్యన మంగళవారం రాత్రి తిరుపతి నగరం ఇలా కనిపించింది.

ఫోరా.. సిక్సా..!

జోరుగా ఐపీఎల్ బెట్టింగ్

- అడ్డాగా హోటళ్లు, అద్దె ఇళ్లు, శివారు ప్రాంతాలు
- ఈజీ మనీ కోసం భవితను పాడు చేసుకుంటున్న యువత



ఈ బాల్ ఫోర్ పోతుందా? సిక్సర్ కొడతాడా.. అంటూ బంతి బంతికీ బెట్టింగ్.

సెంచరీ కొట్టే బ్యాట్స్‌మన్ ఎవరు? ఎక్కువ వికెట్లు తీసే బౌలరు.. గెలిచే జట్టు ఏదీ.. అంటూ మ్యాచ్‌పైనా బెట్టింగు.

ఇలా శివారు ప్రాంతాలు, హోటళ్లు, అద్దె ఇళ్లు కేంద్రంగా జిల్లాలోని పలుచోట్ల ఐపీఎల్ క్రికెట్ పోటీల్లో బెట్టింగ్ జోరగా సాగుతోంది.

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

ఈజీ మనీ కోసం అలవాటు పడిన కొందరు బెట్టింగ్‌వైపు అడుగులేస్తున్నారు. ఆర్థికంగా చితికిపోయి భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారు. ఐపీఎల్ క్రికెట్‌లో బెట్టింగ్ కాసి.. ఎందరో దెబ్బతిన్నారు. ఒకప్పట్లో తిరుపతిలాంటి నగరాలకే పరిమితమైన ఈ బెట్టింగ్.. మొబైల్ ఫోన్లు, సోషల్ మీడియాతో పల్లెలకూ పాకింది. జిల్లాలో కొందరు స్థానికంగానే బెట్టింగ్‌లు కొనసాగిస్తున్నారు. ఇంకొందరు విజయవాడ, బెంగళూరు, చెన్నై, గుంటూరు, ఒడిశా, ఉత్తరప్రదేశ్ లాంటి నగరాల్లో ఉన్న వారితో సంబంధాలు ఏర్పాటు చేసుకుని ఏజెంట్లను నియమించుకుని ఐపీఎల్ క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు సమాచారం. దీనికోసం మండల కేంద్రాలతో పాటు కొన్ని గ్రామాల్లో దూరంగా ఉండే ఇళ్లను అద్దెకు తీసుకుంటున్నట్లు సమాచారం. ఇక, శివారు ప్రాంతాలు, ఏకాంత కాలనీల్లో టీవీతో పాటు మద్యం, ఇతర సదుపాయాలు కల్పించి క్రికెట్ బెట్టింగ్‌లు ఆడిస్తున్నట్లు తెలిసింది. మరికొందరు ల్యాప్‌టాప్‌లు, ఫోన్ల ద్వారా నేరుగా బెట్టింగ్‌లు సాగిస్తున్నారు. తిరుపతి, తిరుచానూరు, సత్యవేడు, తలకోన, ఎర్రావారిపాలెం, ఆరణి, విజయపురం, నాయుడుపేట, గూడూరు లాంటి శివారు ప్రాంతాల్లో క్రికెట్ బెట్టింగ్‌లు జరుపుతున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. గతంలో అయితే మ్యాచు విజయావకాశాలపై బెట్ వేసేవారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగు యాప్‌లు రావడంతో బంతి బంతికి.. ప్రతి ఓవర్‌కూ పరుగులు, వికెట్లు, నోబాల్స్, వైడ్ బాల్స్.. ఇలా అన్ని రకాలుగా బెట్టింగ్‌లు నడుస్తున్నాయి. ఈ బెట్టింగ్‌లో కొంత డబ్బు పోగొట్టుకోగానే ఎలాగైనా తిరిగి సంపాదించాలన్న భావనతో మరింత పందెం కడుతున్నారు. ఇలా.. చివరకు అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారు. ఇలాంటి ఘటనలు ఇటీవల ఎక్కువగానే కనిపిస్తున్నాయి. కాగా, ఐపీఎల్ సీజన్ ప్రారంభంలోనే నిఘాతో స్థానిక బెట్టింగ్ జరిగే ప్రాంతాలను చాలావరకు కట్టడి చేసినా.. ఆన్‌లైన్ బెట్టింగ్‌ను ఆపడం అసాధ్యంగా మారుతోందని పోలీసులు వర్గాలు చెబుతున్నాయి.

రెండు వారాల్లో విచారణ పూర్తి

మున్సిపల్ ఆర్డీ విశ్వనాథ్



అధికారులతో సమావేశమైన ఆర్డీ విశ్వనాథ్

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుత్తూరు మున్సిపాలిటీలో అవినీతి ఆరోపణలపై విచారణలో భాగంగా ఆర్డీ విశ్వనాథ్ మంగళవారం కార్యాలయానికి విచ్చేశారు. పలు కీలక ఫైళ్లను పరిశీలించారు. మరో రెండు వారాల్లో విచారణ పూర్తి చేసి ప్రభుత్వానికి నివేదిస్తామని స్పష్టం చేశారు. కడప జిల్లా ప్రొద్దుటూరు, చిత్తూరు, తిరుపతి కార్పొరేషన్లలో జరిగిన విచారణ నివేదికలను ప్రభుత్వానికి అందించామన్నారు. 2015 సంవత్సరంలో నగరి మున్సిపాలిటీ ఇన్‌చార్జి కమిషనర్‌గా బాలాజీనాథ్ యాదవ్ ఉన్న సమయంలో పెన్షన్ పంపిణీలో అవకతవకలు జరిగాయి. అప్పటి నుంచే విచారణ కొనసాగుతోంది. ప్రస్తుత నగరి కమిషనర్ కృష్ణారెడ్డి మంగళవారం ఆర్డీకి సదరు దస్త్రాలు అందజేశారు. అవకతవకలు ఇంకా తేలక పోవడం గమనార్హం. అలాగే ఏపీ ఎంఎంఎస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామయ్య మంగళవారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయంలో ఆర్డీకి వినతిపత్రం సమర్పించారు. రాయలసీమ జోన్ పరిధిలోని మున్సిపాలిటీల్లో పనిచేసే మేనేజర్లు, ఆర్వోల పట్ల కమిషనర్లు దురుసుగా వ్యవహరిస్తున్నారని విన్నవించారు. పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు, కమిషనర్ మంజునాథ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

విచారణలో తీవ్ర జాప్యం

అవినీతి ఆరోపణలపై కమిటీ చేపట్టిన పునర్విచారణలో తీవ్ర జాప్యం నెలకొంటోంది. అసెంబ్లీ ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ఫిర్యాదు మేరకు అత్యవసరంగా కమిటీని ఏర్పాటు చేసి పునర్విచారణ చేపట్టారు. కమిటీ విచారణ ప్రారంభించి నెల రోజులకు పైగా కావస్తున్నా పురోగతి లేకుంది. కమిటీలో పబ్లిక్ హెల్త్ ఎస్ఈ మోహన్, ఈఈ సుబ్బరాయులు ఇతర అధికారులు ఉన్నారు. వేసవిలో నీటి ఎద్దడిని అధిగమించే బాధ్యత పబ్లిక్ హెల్త్ విభాగంకు ఉండటంతో జిల్లా స్థాయి అధికారులు బిజీగా గడుపుతున్నారు. ఈ క్రమంలో విచారణలో జాప్యం జరుగుతోంది. పుత్తూరు మున్సిపాలిటీలో స్క్రాప్ వేలం విషయంలో లోతుగా విచారణ చేపడుతున్నట్లు సమాచారం.

రెండు ప్రాజెక్టులకు పచ్చజెండా

- భారీ సౌర విద్యుత్, అమోర్ఫస్ మెటల్ ప్లాంట్ల ఏర్పాటుకు కేబినెట్ ఆమోదం

తిరుపతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): జిల్లాను పారిశ్రామికంగా బలోపేతం చేసే దిశగా రాష్ట్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన జరిగిన మంత్రి వర్గ సమావేశంలో ప్రభుత్వం జిల్లాకు సంబంధించి రెండు కీలక ప్రతిపాదనలకు ఆమోదముద్ర వేసింది. చిల్లకూరు మండలం తమ్మినపట్నం, తూర్పు కనుపూరు, వెల్లపాలెం గ్రామాల్లో కోట మండలం కర్లపూడి, సిద్ధవరం గ్రామాల పరిధిలో 700 మెగావాట్ల భారీ సౌర విద్యుత్ ప్రాజెక్టు నెలకొల్పడానికి చింత గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. ఈ ప్రతిపాదనకు మంత్రివర్గం అనుమతి ఇచ్చింది. అలాగే శ్రీసిటీ పరిధిలో అమోర్ఫస్ మెటల్ తయారీ ప్లాంటు ఏర్పాటు చేయడానికి ఆసక్తి చూపుతూ ప్రొటేరియల్ లిమిటెడ్ ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకుంది. దీనిపై కూడా మంత్రివర్గం సానుకూలంగా స్పందించింది. ఆమోదం తెలిపింది.

రేపటి వరకు పాలిసెట్ దరఖాస్తు గడువు పొడిగింపు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఏపీ పాలిసెట్-25 ఆన్‌లైన్ దరఖాస్తు గడువు గురువారం వరకు పొడిగించినట్లు కోచింగ్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర ఉపాధ్యక్షుడు, విశ్వం పోటీ పరీక్షల సమాచార కేంద్రం చైర్మన్ డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి పేర్కొన్నారు. ఈనెల 30న ప్రవేశపరీక్ష జరుగుతుందని, ఆబ్జెక్టివ్ విధానంలో 120మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుందని, గణితంలో 50ప్రశ్నలు, ఫిజిక్స్‌లో 40, కెమిస్ట్రీలో 30చొప్పున ప్రశ్నలు ఉంటాయని వివరించారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు దీన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. ఈపరీక్షకు సంబంధించిన పూర్తి వివరాల కోసం 86888 88802/03, 93999 76999 ఫోన్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

'స్పోక్' కోసం భవనాల పరిశీలన



ఏర్పేడులో స్థలాలకు సంబంధించి మ్యాప్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్

రేణిగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలో రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్‌కు అనుసంధానంగా ఏర్పాటు కానున్న స్పోక్ (సింగిల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్) మోడల్ భవనం గుర్తింపు పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ ఎస్.వెంకటేశ్వర్ ఆదేశించారు. స్పోక్ భవనం కోసం మంగళవారం ఐఐటీ డైరెక్టర్ సత్యనారాయణ, ఐటీఈపీఓ ప్రతినిధి దీప్తి, అమరరాజా, అదానీ సంస్థల ప్రతినిధులతో ఆయన సమావేశమయ్యారు. ఏపీని పారిశ్రామికంగా అభివృద్ధి చేసేందుకు రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్ ఏర్పాటుకు సీఎం చంద్రబాబు ప్రతిపాదనలు చేశారన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో ఐదు సింగల్ పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ హబ్‌లు ఏర్పాటు చేయనున్నారని, అందులో తిరుపతి ఉందన్నారు. ఇక్కడ ఏర్పాటు చేయనున్న స్పోక్‌లో టెక్నాలజీ ఆవిష్కరణలకు ముందుకు వచ్చే విద్యార్థులకు అన్ని విధాల సహకారం అందించి నూతన ఆవిష్కరణలకు దోహదపడేలా చేస్తామన్నారు. అదానీ, అమరరాజా, నవయుగ పరిశ్రమలు, తిరుపతి ఐఐటీ సహకారంతో టెక్నాలజీ ఆవిష్కరణల కోసం కొత్త ఆలోచనలతో వచ్చే విద్యార్థులకు సాఫ్ట్‌వేర్, హార్డ్‌వేర్‌లో సహకారం అందిస్తామని చెప్పారు. తిరుపతి స్పోక్ హబ్‌లో నెల్లూరు, అన్నమయ్య, చిత్తూరు జిల్లాలు ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో చీఫ్ ఆర్కిటెక్చర్ మణి సందీప్, అదానీ కృష్ణపట్నం పోర్టు లిమిటెడ్ సీవోవో రాజన్‌బాబు, నవయుగ సీఈవో సుబ్బారావు, శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి, ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ విజయ్ భరత్ రెడ్డి, ఏర్పేడు తహసీల్దార్ భార్గవి తదితరులు పాల్గొన్నారు. ఏర్పేడులో స్థలాలను కలెక్టర్ పరిశీలించారు.



అధికారులతో మాట్లాడుతున్న జేసీ శుభం బన్సల్

మామిడి పండ్లను సహజంగా మగ్గపెట్టాలి

రసాయనాలు వినియోగిస్తే క్రిమినల్ చర్యలు : జేసీ

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'వరిగడ్డి, కార్బోర్ బాక్సు, పేపర్ బ్యాగ్స్‌ను ఉపయోగించి సహజసిద్ధంగా మామిడి పండ్లను మగ్గపెట్టాలి. అనుమతుల్లేని కాల్షియం కార్బైడ్‌ను ఉపయోగిస్తే క్రిమినల్ కేసులు పెట్టాల్సి వస్తుంది' అంటూ వ్యాపారులను జేసీ శుభం బన్సల్ హెచ్చరించారు. పండ్లు మగ్గపెట్టడం కాల్షియం కార్బైడ్‌ను నిరోధించడంపై కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. మామిడి పండ్లు సీజన్ మొదలవుతున్న కారణంగా ఆరోగ్యానికి హాని కలిగించే రసాయనాలతో మామిడి పండ్లు మగ్గపెట్టే ప్రక్రియను నిరోధించడంపై ఆయన అధికారులతో చర్చించారు. కమిటీలోని సంబంధిత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. దీనిపై పండ్ల వ్యాపారులకూ అవగాహన కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యానశాఖ అధికారి దశరథరామిరెడ్డి, డీపీవో సుశీలాదేవి, అసిస్టెంట్ ఫుడ్ కంట్రోలర్ వెంకటేశ్వర్ రావు, జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి మద్దిలేటి, ఫుడ్ సేఫ్టీ అధికారి జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

24 నుంచీ ఎస్వీయూ పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్వీ యూనివర్సిటీ పరిధిలో పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 24వ తేదీ నుంచీ ప్రారంభం కానున్నాయి. తొలుత ఈ నెల 15వ తేదీ నుంచీ ఈ పరీక్షలు నిర్వహించాలని భావించారు. అయితే 24వ తేదీ నుంచీ పరీక్షలు చేపట్టాలని తాజాగా నిర్ణయించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను పరీక్షల అధికారి దామ్లా నాయక్ ప్రకటించారు. ఈ నెల 29వ తేదీ నాటికి పీజీ నాల్గవ సెమిస్టర్ పరీక్షలు ముగియనున్నాయి. పరీక్షల నిర్వహణకు అధికార యంత్రాంగం ఏర్పాట్లు చేస్తోంది.

తిరుమలలో దారితప్పుతున్న డ్రైవర్లు

- కొందరి తీరుపై పెరుగుతున్న ఫిర్యాదులు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమల కొండపై కొంతమంది ట్యాక్సీ డ్రైవర్లు దారి తప్పుతున్నారు. భక్తులతో అమర్యాదగా నడుచుకోవడం, మద్యం, గంజాయి తాగడం, తోటి డ్రైవర్లతో గొడవలు పడుతుండటం వంటి చర్యలతో వివాదాలకు తెరలేపుతున్నారు. ఇటీవల పార్కింగ్ అంశంలో ముగ్గురు డ్రైవర్ల దాడిలో గాయపడిన ఓ డ్రైవర్ మృతి చెందిన సంగతి తెలిసిందే. కొండమీద దాదాపు 2,500కు పైగాట్యాక్సీలు ఉన్నాయి. 6 వేల మందికిపైగా డ్రైవర్లు వీటిపై ఆధారపడి బతుకుతున్నారు. చిత్తూరు, అన్నమయ్య, నెల్లూరు వంటి ఇతర జిల్లాల వారూ తిరుపతి- తిరుమల మధ్య ట్యాక్సీలు నడుపుతున్నారు. ఇటీవల కొందరు నిబంధనలకు విరుద్ధంగా ఎక్కువ మందిని ట్యాక్సీల్లో ఎక్కించుకుంటున్నారు. అతివేగంతో వాహనాలను నడుపుతున్నారు. రాత్రి వేళ కొందరు హైనర్లే నడిపేస్తున్నారు. భారీ శబ్దాల హారన్లతో మోతెక్కిస్తున్నారు. భక్తులతోనూ కొందరు అమర్యాదగా నడుచుకుంటున్నారనే ఫిర్యాదులు తరచూ అందుతున్నాయి. పార్కింగ్ ప్రాంతాల్లో తామే భక్తులను వాహనాల్లో ఎక్కించుకోవాలని కొంతమంది బృందాలుగా మారి నిత్యం ఘర్షణలకు దిగుతున్నారు. ప్రీపెయిడ్ ట్యాక్సీ సిస్టమ్ పెడతామన్న టీటీడీ, పోలీసులు ప్రకటనకే పరిమితమయ్యారు. ఇప్పటికైనా టీటీడీ ఉన్నతాధికారులు, ట్రాఫిక్, పోలీసు, విజిలెన్స్ అధికారులు జాగ్రత్తలు తీసుకోవాలి.



డ్రైవర్లతో మాట్లాడుతున్న పోలీసులు

ట్రాఫిక్ పోలీసుల తనిఖీలు

ట్రాఫిక్ పోలీసులు మంగళవారం తిరుమల పార్కింగ్ ప్రాంతాల్లో తనిఖీలు నిర్వహించారు. ట్యాక్సీ డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గొడవలు పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మితిమీరితే లైసెన్సులను సీజ్ చేయడంతో పాటు వాహనాలను స్వాధీనం చేసుకుంటామని హెచ్చరించారు.

భూమనపై క్రిమినల్ కేసు నమోదు చేయాలి

- ఎస్పీకి టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్ రెడ్డి పిర్యాదు



ఎస్పీ హర్షవర్ధనరాజుకు ఫిర్యాదు చేస్తున్న భానుప్రకాష్‌రెడ్డి, సామంచి తదితరులు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): హిందువులు మనోభావాలు దెబ్బతీస్తూ గోశాలలో గోవుల మరణాలపై టీటీడీ మాజీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి చేస్తున్న అసత్య ప్రచారాలపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని పలువురు బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం టీటీడీ పాలక మండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, జిల్లా బీజేపీ అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, పార్టీ నాయకులు అజయ్‌కుమార్, డాక్టర్ శ్రీహరి, ఆముదాల ఓంప్రకాష్‌లు ఈమేరకు జిల్లా ఎస్పీ హర్షవర్ధనరాజును కలిసి ఫిర్యాదు చేశారు. అనంతరం భానుప్రకాష్‌రెడ్డి మీడియాతో మాట్లాడారు. ఎస్వీ గోశాలలో 100 గోవులు మరణించాయని, గోశాలను గో వధశాలగా మార్చారంటూ తప్పుడు ప్రచారాలు చేస్తున్న కరుణాకర రెడ్డిపై ఐటి యాక్టు 74, బీఎన్ఎస్ యాక్టు 365 కింద కేసు నమోదు చేయాలని కోరారు. ఆయన చైర్మన్‌గా ఉన్న సమయంలో 45 లేగదూడలు, 34 గోవులు చనిపోయిన విషయం మరచిపోయారా అని ప్రశ్నించారు. అనారోగ్యం, వయసురీత్యా చనిపోతున్నా దుష్ప్రచారాలు చేయడం మంచి పద్ధతి కాదన్నారు. వైసీపీ హయాంలో గోవులకు పురుగులు పట్టిన ఆహారం, కాలం చెల్లిన మందులు వాడారని ఆరోపించారు. టీటీడీ పరిధిలో వైసీపీ హయాంలో జరిగిన అక్రమాలన్నిటిపై చర్యలు తీసుకుంటామన్నారు. బిహార్ కంటే వైసీపీ హయాంలో జరిగిన దాణా స్కాం పెద్దదన్నారు. భవిష్యత్తులో టీటీడీపై ఆధారాలు లేకుండా అసత్య ప్రచారాలు చేసేవారిపై చర్యలు తీసుకునేలా త్వరలో బోర్డులో నిర్ణయం తీసుకుంటామని భానుప్రకాష్ రెడ్డి తెలిపారు.

వైభవంగా రాములవారి పట్టాభిషేకం



చంద్రగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోదండ రామాలయంలో మంగళవారం ఉదయం వైభవంగా కోదండరాముడి పట్టాభిషేకం జరిగింది. ఉదయం నిత్యకట్ల కైంకర్యాలనంతరం సీతారామ లక్ష్మణ సమేత హనుమంతు ఉత్సవర్లను విశేషంగా అలంకరించి సింహాసనంపై అధిష్ఠించారు. వేద మంత్రాలు, మంగళ వాయిద్యాలు నడుమ శ్రీరామ పట్టాభిషేకాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకుడు శ్రీనివాసబట్టర్, డిప్యూటీ ఈవో దేవేంద్రబాబు, టెంపుల్ ఇన్స్పెక్టర్ మునిహరిబాబు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు.

ముగిసిన ఎల్లమ్మ లక్ష కుంకుమార్చన



చంద్రగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మూలస్థాన ఎల్లమ్మ ఆలయంలో మూడు రోజుల పాటు జరుగుతున్న సామూహిక లక్ష కుంకుమార్చన మంగళవారం ముగిసింది. ఉదయం అమ్మవారి మూలవిరాట్‌కి వివిధ రకాల అభిషేకాలు చేశాక విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం ఉత్సవమూర్తిని ప్రత్యేక మండపంలో కొలువుదీర్చి సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించారు. రాత్రి ఊంజల్ సేవనిర్వహించారు. కుంకుమార్చనలో పాల్గొన్న భక్తులకు పసుపు, కుంకుమ, పసుపుదారం, గాజులు, జాకెట్టు, లక్ష్మీదేవిచిత్రపటం, ప్రసాదం అందజేశారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ చైర్మన్ మొక్కల చంద్రశేఖర్‌రెడ్డి, ఈవో మమత, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఔషధ నాణ్యత, స్థిరత్వంపై ప్యాకేజి ప్రభావం



మాట్లాడుతున్న నటరాజ్ నందమూరు

రామచంద్రాపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఔషధ నాణ్యత, స్థిరత్వం, భద్రతకు ఫార్మస్యూటికల్ ప్యాకేజి చాలా ముఖ్యమని హైదరాబాద్‌కు చెందిన ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ప్యాకేజింగ్ డిప్యూటీ డైరెక్టర్ నటరాజ్ నందమూరు అన్నారు. మంగళవారం మండలంలోని వెంట్రామపురం సమీపంలోని సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో ప్యాకేజింగ్ ప్రభావం అనే అంశంపై జాతీయ వర్క్‌షాప్‌ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్యాకేజింగ్ ఔషధం భౌతిక, రసాయన లక్షణాలను అనుగుణంగా ఉండాలన్నారు. దీంతో ఔషధ నాణ్యతను పెంపొందించవచ్చన్నారు. కార్యక్రమంలో కళాశాల అకడమిక్ అడ్మినిస్ట్రేటర్ లక్ష్మయ్య, వైస్ ప్రిన్సిపాల్ ప్రసన్నరాజు, బోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు


మాట్లాడుతున్న ఎంపీపీ యుగంధర్‌రెడ్డి

భాకరాపేట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఎంపీపీ యుగంధర్ రెడ్డి అన్నారు. మంగళవారం మండల సర్వసభ్య సమావేశం స్థానిక స్త్రీశక్తి భవన్‌లో జరిగింది. మహిళా సమాఖ్య ద్వారా వెదురు పెంపకం, తేనెటీగల పెంపకం, ఫిష్ పాండ్ వంటి పథకాలను అమలు చేస్తున్నట్లు ఏపీఎం స్వర్ణలత తెలిపారు. వెదురు పెంపకానికి హెక్టారుకు రూ.50 వేల సబ్సిడీ అందిస్తున్నట్లు ఉద్యాన అధికారి శివకుమారి పేర్కొన్నారు. 279 గోకులాలు, 84 నీటి తొట్టెలను రైతులకు మంజూరు చేసినట్లు పశువైద్యాధికారిస్రవంతి తెలిపారు.పట్టణ ప్రాంతాల్లో రెండు సెంట్లు, గ్రామీణ ప్రాంతాల్లో మూడు సెంట్లు ఇళ్ల స్థలాలు పంపిణీ చేయనున్నట్లు డీటీ వాసుదేవ కుమార్ చెప్పారు. జడ్పీటీసీ స్వరూప, వైఎస్-ఎంపీపీలు దామోదర్ రెడ్డి, సునీత, ఎంపీడీవో గిడ్డయ్య, డిప్యూటీ ఎంపీడీవో సోమశేఖర రెడ్డి ,వైద్యాధికారి శ్రీధర్, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

మనోవేదనతో వివాహిత ఆత్మహత్య


స్నేహ మృతదేహం

పిచ్చాటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేరని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కీళపూడి పంచాయతీ అక్కగారిపేటలో మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.... గుమ్మడిపూండి సమీపంలో బిల్లాకుప్పానికి చెందిన స్నేహ(23)కు ఐదు సంవత్సరాల క్రితం అక్కగారిపేటకు చెందిన జీవరాజ్‌తో వివాహమైంది. కాలం గడుస్తున్నా పిల్లలు కలగలేదని ఆవేదన ఇంట్లో ఒంటరిగా ఉండడంతో మానసిక క్షోభతో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించి నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మరణించినట్లు ధ్రువీకరించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

శ్రీశైలం దేవస్థానానికి పట్టువస్త్రాల సమర్పణ

రేణిగుంట ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు, నల్ల గాజులు, పసుపు, కుంకుమను ఏర్పేడు మండలం జంగాలపల్లికి టీడీపీ నైనారు పొన్నారావు కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు... పొన్నా రావు కుటుంబసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టువస్త్రాలను అందుకున్నారు. అనంతరం వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేసి సత్కరించారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం జాతర సంప్రదా యపద్ధతిలో ప్రారంభమైంది. మొదటి రోజు ముత్యాలమ్మకు పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు అంబలి ప్రసాదాన్ని పంపి ణీ చేశారు. ఉదయం 9గంటలకు యాదవ కులస్థులు ముత్యాలమ్మ, రేణుకమ్మ ఉత్సవ మూర్తులు, పోతురాజును వెంటబెట్టుకుని గెరిగ ఉత్సవం ప్రాంభించారు. వాయిద్యాలు వాయి స్తూ నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మైలు ముగ్గు, రాత్రి 7 గంటలకు శేషపాన్పు ముగ్గు వేశారు. రాత్రి గంగపెట్టెను ఊరేగించారు. భక్తులు పెద్దసం ఖ్యలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో హేమ మాలిని, సూపరింటెండెంట్ రవి, నాగభూషణం యాదవ్, లక్ష్మయ్య, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్

కోట, ఏప్రిల్ 15: కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2023 - 24 సంవత్సరంలో మండలంలోని 21 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ వరప్రసాద్ సమక్షంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు వెల్లడించారు. పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు రోడ్లకు ఇరువైపులా, పంచాయతీల్లో మొక్కలు నాటకపోయినప్పటికీ మస్టర్లు తయారు చేసి బినామీ పేర్లతో నిధులు స్వాహా చేశారని తేలింది. అంతేకాకుండా ఉపాధి పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టకుండా, ప్రింటెడ్ రికార్డులు లేకుండా మస్టర్లు తయారు చేసినట్లు వెల్లడైంది. అదేవిధంగా మినీ గోకులాన్ని లబ్ధిదారుడికి కాకుండా వేరొకరికి కట్టించినట్లు వెల్లడించారు. గూడలి పంచాయతీలో 400 మొక్కలు నాటినట్లు, కొన్ని పంచాయతీల్లో కొలతలు తక్కువ చూపి ఎక్కువ నగదు డ్రా చేసినట్లు తేలింది. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్లు శాంతి, ఏవీ భాస్కర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. అదేవిధంగా ఏపీవో పూర్ణిమను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. పలు పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ4.50 లక్షలు రికవరీ చేస్తున్నామని పీడీ తెలిపారు.

డాక్టరేట్ ప్రదానం


చలమల శిల్ప

చంద్రగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పుల్లయ్యగారిపల్లెకు చెందిన చలమల శిల్ప డాక్టరేట్ పొందారు. చెన్నైలోని ఎస్ఆర్ఎం యూనివర్శిటీలో కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్ విభాగంలో సమర్పించిన పరిశోధన గ్రంథానికి గాను దీనిని అందుకున్నారు. ప్రొఫెసర్ నిరంజన్ పర్యవేక్షణలో శిల్ప పరిశోధన పూర్తి చేశారు. ఎస్ఆర్ఎం యూనివర్శిటీ పరీక్షల అధికారి గుణశేఖరన్ ఈమేరకు తెలిపారు.

27న ఎస్వీ పోటు వర్కర్స్ కో-ఆపరేటివ్ సొసైటీ ఎన్నికలు

తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): వేంకటేశ్వర పోటు వర్కర్స్ లేబర్ కాంట్రాక్ట్ కో-ఆపరేటివ్ సొసైటీ లిమిటెడ్ ఎన్నికలు ఈనెల 27న జరుగనున్నాయి. ఎన్నికల అధికారిగా సురేష్‌బాబును నియమించారు. ఏడుగురు డైరెక్టర్లు ఉండే ఈ సొసైటీ ఎన్నికలకు 17న నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు. 21వ తేదీ ఉదయం 10 నుంచి 4 గంటల వరకు నామినేషన్ల ప్రక్రియ ఉండనుంది. 22న నామినేషన్ల పరిశీలన, 23న ఉపసంహరణ ఉంటుంది. తిరుమలలోని టీటీడీ ఎస్వీ హైస్కూల్‌లో పోలింగ్ నిర్వహించనున్నారు. పోలింగ్ పూర్తయిన తర్వాత కౌంటింగ్ ఉంటుందని సురేష్‌బాబు తెలిపారు.

తిరుచానూరులో రెండు ఇళ్లలో చోరీ


చోరీ జరిగిన ఇంట్లో చిందర వందరగా వస్తువులు

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పరిధిలోని చంద్రబాబు నాయుడు కాలనీలో సోమవారం అర్ధరాత్రి రెండు ఇళ్లల్లో దొంగలు పడ్డారు. ఎస్ఐ జగన్నాథ రెడ్డి కథనం మేరకు ఈ కాలనీలో వెంకట క్రిష్ణ వెల్డింగ్ షాపు పెట్టుకున్నాడు. ఇక్కడే ఉంటున్నాడు. ఇటీవల కుటుంబ సభ్యులతో బెంగళూరు వెళ్ళారు. ఇదే అదునుగా దొంగలు ఇంటి తాళాలు పగలగొట్టి 30 సవరాల బంగారు నగలు, వెండి వస్తువులు, రూ. 20 వేలు అపహరించుకుపోయారు. అదే కాలనీలో మురుగేష్ స్థానిక హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులో పనిచేస్తున్నారు. ఈయన స్నేహితుడితో కలసి బయటకు వెళ్లారు. అదే సమయంలో ఆయన భార్య శ్రీలేఖ బీటీఆర్ కాలనీలోని పుట్టింటికి వెళ్ళింది. దీంతో దొంగలు వీరింటి తాళాలు పగులగొట్టి 10 గ్రాముల బంగారు నగలు, రూ.10వేలు అపహరించారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఘర్షణలో ఐదుగురికి తీవ్రగాయాలు

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంగళంలో మంగళవారం ఇరువర్గాల ఘర్షణలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. సీఐ సునీల్ కుమార్ కథనం మేరకు మంగళంలో వీరభద్ర అనే వ్యక్తికి కొంత భూమి ఉంది. దీని పక్కనే అతడి బంధువుల భూమి కూడా ఉంది. దీనిపై కొంత కాలంగా ఇరువర్గాల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం వీరభద్ర భూమిని బంధువైన హరి ఆక్రమించుకున్నాడని, ఇతడి భూమిని వీరభద్ర ఆక్రమించుకున్నాడనే ఇరువర్గాల కుటుంబ సభ్యులు ఘర్షణకు దిగారు. రాళ్లు, కర్రలతో దాడిచేసుకున్నారు. ఐదుగురు తీవ్రంగా,19 మంది స్వల్పంగా గాయపడ్డారు. తీవ్రంగా గాయపడినవారిని ఆసుపత్రికి తరలించారు. ఎస్ఐ జగన్నాథం కేసు దర్యాప్తుచేస్తున్నారు.

'రాయల్' జయంతిని అధికారికంగా నిర్వహించండి


శ్యామలరావుకు వినతిపత్రం అందజేత

తిరుపతి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకృష్ణదేవరాయల జయంతిని అధికారికంగా నిర్వహించాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ (ఆర్పీఎఫ్) వ్యవస్థాపక అధ్యక్షుడు రెడ్డి శేఖర్ రాయల్ కోరారు. మంగళవారం టీటీడీ ఈవో శ్యామలరావును ఆర్పీఎఫ్ ప్రతినిధులు కలిసి వినతిపత్రం అందజేశారు. టీటీడీ ఎంతోమంది ప్రముఖుల జయంతి కార్యక్రమాలు నిర్వహిస్తోందని, వేంకటేశ్వరస్వామిని ఏడు సార్లు దర్శించుకుని అంతులేని సంపదను విరాళంగా అందజేసిన రాయల జయంతిని కూడా టీటీడీ నిర్వహిస్తే సముచిత గౌరవం ఇచ్చినట్టు ఉంటుందన్నారు. ఈవోను కలిసిన వారిలో నరసింహులు, మోహన్ రాయల్ తదితరులు ఉన్నారు.

ఇలాగే వదిలేస్తారా?

అసంపూర్తిగా ఆరోగ్య భవన నిర్మాణం


నిలిచిన వెల్‌నెస్ కేంద్ర భవన నిర్మాణ పనులు

తిరుపతి రూరల్, ఏప్రిల్15 (ఆంధ్రజ్యోతి): రూరల్ మండలం దుర్గసముద్రంలో 2021లో చేపట్టిన హెల్త్ అండ్ వెల్‌నెస్ కేంద్ర భవన నిర్మాణాన్ని అర్ధాంతరంగా వదిలేశారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ఎన్ఆర్ఈజీఎస్ నిధులు రూ.17.50లక్షలతో సచివాలయానికి ఆనుకుని ఉన్న ఖాళీస్థలంలో ఈ భవన నిర్మాణ పనులు ప్రారంభించారు. బేస్‌మెంట్, స్లాబు వరకూ వేసి మిగిలిన పనులను పూర్తిచేయలేరు. పునాదులు వానకు తడిసి నలుపు రంగులోకి మారిపోయాయి. స్లాబుకు పాచిపట్టి అధ్వానంగా తయారైంది. దుర్గసముద్రంతోపాటు అడ్డపారెడ్డిపల్లె, ఒడ్డిపల్లె, హరిజనవాడల ప్రజలకు ప్రాథమిక వైద్య సేవలు(పీహెచ్‌సీ)అందించేందుకు ఈకేంద్రాన్ని మంజూరు చేశారు. భవన నిర్మాణం పూర్తికాకపోవడంతో పాతపంచాయతీ కార్యాలయాన్నే పీహెచ్‌సీగా వినియోగిస్తున్నారు. బేస్‌మెంట్, స్లాబు పనులకు సంబంధించి కాంట్రాక్టర్‌కి రూ.3.61లక్షల బిల్లును మంజూరు చేసినా తర్వాత దశలో నిధుల కొరత కారణంగా పనులు చేపట్టేందుకు కాంట్రాక్టర్ ఆసక్తి చూపలేదని తెలిసింది. అధికారులు స్పందించి భవనాన్ని అందుబాటులోకి తీసుకురావాలని గ్రామస్థులు పలువురు కోరుతున్నారు. గ్రామంలో చెత్తసేకరణ మినీఆటోను ఖాళీస్థలంలో మూలన పడేశారు. మరమ్మతులు చేపడితే దీనిని ఉపయోగించుకునే వీలుంది.

ఎండ నుంచి రోగులకు ఉపశమనం


పందిరి నీడన రోగులను తీసుకువెళుతున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రుయాలో రోగులకు మండుటెండ ఇబ్బందులు తప్పాయి. ఇటీవల ఆస్పత్రిని కలెక్టరు వెంకటేశ్వర్ తనిఖీ చేశారు. ఎండల్లో రోగులను స్ట్రెచర్లపై తీసుకువెళ్తుండటాన్ని గుర్తించారు. వెంటనే ఆయన స్పందించారు. అధికారులకు తగిన ఆదేశాలు జారీ చేశారు. ఫలితంగా ఆస్పత్రి ఆవరణలో ఓ పక్కగా పచ్చటి వస్త్రంతో కూడిన పందిళ్లను ఏర్పాటు చేశారు. ఇది కొంత ఉపశమనం కలిగిస్తోంది. వైద్య పరీక్షలకు రోగులను ఎండ తగలకుండా పందిరి కింద తీసుకువెళుతున్నారు. ఆస్పత్రి పరిసరాల్లోని అన్ని మార్గాల్లో ఇలాంటి తాత్కాలిక చర్యలు తీసుకోవాలని రోగుల బంధువులు కోరుతున్నారు.

సమ్మర్‌లో ఘాట్ ట్రిప్పుల పెంపు

● సమీక్షించిన అధికారులు


సమీక్షిస్తున్న డీపీటీవో నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవి సెలవుల దృష్ట్యా వివిధ ప్రదేశాల నుంచి తిరుమల వచ్చే భక్తుల సౌకర్యార్థం ఆర్టీసీ యంత్రాంగం ముందు జాగ్రత్త చర్యలు చేపట్టింది. ఘాట్‌లో తిరిగే ఆర్టీసీ బస్సు ట్రిప్పుల పెంపునకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ అంశమై మంగళవారం డీపీటీవో జి.నరసింహులు, డిప్యూటీ సీటీఎం విశ్వనాథం సమీక్షించారు. ఇప్పటి వరకు 405 బస్సులు డీజిల్, ఎలక్ట్రిక్ బస్సులతో రోజుకు 1,650 ట్రిప్పులు ఘాట్‌లో తిరుగుతున్నాయి. ఈ సంఖ్యతో రద్దీ సాధారణంగా కంటే కాస్త పెరిగినప్పుడు సమస్య తలెత్తడం లేదు. రద్దీ అధికమైనప్పుడు బస్సుల కొరత ఏర్పడుతున్న దృష్ట్యా సత్యవేడు 9, పుత్తూరు 9, శ్రీకాళహస్తి 25 బస్సులు డిపోలకు తిరిగి వెళ్లకుండా తిరుపతి - తిరుమలకు తిరగడం, అలాగే వేలూరు, కంచి, చెన్నై, తిరుత్తణి బస్సుల్లో కూడా కొన్నింటిని ఇక్కడే తిప్పడం మూలానా అదనపు ట్రిప్పులకు అవకాశం ఉంటుందని మార్పులు తీసుకొచ్చారు. ఈ ప్రకారం బస్సుల సంఖ్య పెరగకనే ట్రిప్పుల సంఖ్యను 1,950 పెంచేందుకు రంగం సిద్ధం చేశారు. ఎలక్ట్రిక్ బస్సులు కూడా 85శాతం నుంచి 95శాతం తిరిగేలా నిర్వాహకులను ఆదేశించారు. ఈ విధంగా అదనపు విధులు నిర్వహించే డ్రైవర్లకు అలవెన్సులు ఇవ్వడానికి అంగీకరించారు. ప్రయాణీకుల సౌకర్యార్థం తిరుపతి ఏడుకొండల బస్టాండు, తిరుమలలో బాలాజీ, రాంభగీచ బస్టాండుల వద్ద అదనపు టిక్కెట్ జారీ కౌంటర్లు, డిస్పాచర్ల సంఖ్యను పెంచారు. గత శని, ఆది, సోమవారాల్లో ఈ విధానం అమలు చేసి ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతమయ్యారు. ఇదే విధానాన్ని వేసవి సెలవుల్లో అమలు చేయాలని డీపీటీవో నరసింహులు అధికారులను ఆదేశించారు. జూన్ లో పాఠశాలలు పునఃప్రారంభమయ్యే వరకు ఈ విధానాన్ని కొనసాగించడానికి ఆయా డిపోల మేనేజర్లు సన్నద్ధమయ్యారు.

టీటీడీ ఎస్టేట్స్ అధికారిగా సువర్ణమ్మ

● డిప్యూటీ ఈవోలుగా వెంకటసునీల్, సోమన్ నారాయణ

తిరుపతి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): టీటీడీలో మూడు కీలక పోస్టుల్లో ప్రభుత్వం అధికారులను నియమించింది. డిప్యూటీ కలెక్టర్ జి.సువర్ణమ్మను టీటీడీ ఎస్టేట్స్ అధికారిగా రెవెన్యూ శాఖ నుంచీ దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసింది. ఆమెకు డిప్యూటీ ఈవోగా త్వరలో నియామక ఉత్తర్వులు అందనున్నాయి. డిప్యూటీ కలెక్టర్ టి.వెంకటసునీల్‌ను రెవెన్యూ శాఖ నుంచీ దేవదాయ శాఖకు డెప్యుటేషన్‌పై బదిలీ చేసి టీటీడీ డిప్యూటీ ఈవోగా నియమించనుంది. ప్రస్తుత డిప్యూటీ ఈవో జి.విజయలక్ష్మిని జీఏడీలో రిపోర్టు చేయాలని ఆదేశించింది. ఆ స్థానంలో వెంకటసునీల్ నియమితులు కానున్నారు. సెలెక్షన్ గ్రేడ్ మున్సిపల్ కమిషనర్ హోదా కలిగిన ఆర్.సోమన్ నారాయణ ప్రస్తుతం విశాఖపట్నం అదనపు కమిషనర్‌గా పనిచేస్తున్నారు. ఆయనను ప్రభుత్వం డెప్యుటేషన్‌పై దేవదాయ శాఖకు బదిలీ చేసి టీటీడీలో డిప్యూటీ ఈవో గా నియమించింది. ఈ మేరకు ప్రభుత్వం మంగళవారం ఉత్తర్వులు జారీ చేసింది.

ప్లాస్టిక్ పైపుల తొలగింపు

మంగళం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంగళం వద్ద వెంకటేశ్వరకాలనీలో ఎ చిన్న పరిశ్రమ నుంచి వచ్చే వ్యర్థాలను పైపుద్వారా అటవీప్రాంతంతోకి వదులుతున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. మంగళవారం రేంజ్ ఆఫీసర్ సుదర్శన్‌రెడ్డి సిబ్బందితో వెళ్లి ఆ ప్లాస్టిక్ పైపులను తొలగించారు. అడవిలో ఎలాంటి పైపులను వేయకూడదని స్థానికులకు సూచించారు. పరిశ్రమ వివరాలను తెలుసుకుంటామని సుదర్శన్‌రెడ్డి తెలిపారు.

కాలభైరవుడి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు వెళ్ళి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

కనులపండువగా ఈశ్వరయ్య తెప్పోత్సవం

డక్కిలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లల్లో భాగంగా మంగళవారం రాత్రి శివ పార్వతుల తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, గిరిజ నృత్యాల నడుమ స్వామివారి తేప్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు కోనేరులో తెప్పపై మూడుసార్లు విహరించారు. స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్లలో మెత్తం రూ.7,69,235 లక్షలు ఆదాయం వచ్చింది. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,67,135, ప్రత్యేక దర్శన టికెట్లు ద్వారా రూ.71 వేలు, తలనీలాల టికెట్లు ద్వారా రూ.19,850, స్వామివారి కల్యాణం చదివింపుల ద్వారా రూ.1,20,768, అభిషేకం టికెట్లు ద్వారా రూ.4,750, ఉభయ కట్నాల ద్వారా రూ.45 వేలు, అన్నదాన విరాళాలు రూ.91,840 వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

దారుణాలు బయటపడతాయనే వైసీపీ నేతల నిందలు

● భూమన వ్యాఖ్యలపై టీటీడీ ఉద్యోగుల స్పందనేదీ? ● నరసింహ యాదవ్, ఆర్సీ మునికృష్ణ మండిపాటు


మాట్లాడుతున్న నరసింహయాదవ్, ఆర్సీ మునికృష్ణ తదితరులు

రుపతి(ఎంఆర్‌పల్లె), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలోనే గోశాలలో ఘోరాలు జరిగాయని, పశువుల దాణాన్ని కూడా పందికొక్కుల్లా పీక్కుతిన్నారని రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్ ఆరోపించారు. డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణతో కలసి మంగళవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వంలో జరిగిన దారుణాలు ఎక్కడ కూటమి ప్రభుత్వం చేపట్టిన ప్రక్షాళనలో బయటపడతాయోననే భయంతోనే ముందుగానే ఈ ప్రభుత్వంపై నిందలు వేస్తున్నారని ఆరోపించారు. చనిపోయిన ఆవులను, దూడలను నిర్లాక్ష్యంగా చెత్తబుట్టల్లో పడేసిన ఘనత వారిదేనన్నారు. ఈ అరాచకాలకు అప్పటి గోశాల డైరెక్టర్ హరినాథ్‌రెడ్డి బాధ్యుడని చెప్పారు. తన అక్రమాలు బయటపడుతాయన్న ఉద్దేశ్యంతో విజిలెన్సు అధికారులను గోశాలకు రానీయకుండా చేశారని అన్నారు. వైసీపీ ప్రభుత్వంలో 2022 ఏప్రిల్ - జనవరి 2023 మధ్య తిరుపతిలోని ఎస్వీ గోశాలలో 27, పలమనేరులో 25, కమలయ్యగారిపల్లెలో 7, పది నెలల వ్యవధిలోనే 60 ఆవులు, దూడలను నిర్లక్ష్యంగా పొట్టనపెట్టుకున్నారని ఆరోపించారు. జగన్‌రెడ్డి పాలనలో టీటీడీ ఐటీ వ్యవస్థను భ్రష్టు పట్టించారన్నారు. కూటమి పాలనలో టీటీడీ గోశాలకు పారదర్శకత, మూగజీవాల రక్షణకు కట్టుదిట్టమైన చర్యలు చేపడుతున్నామన్నారు. మునికృష్ణ మాట్లాడుతూ టీటీడీలో 2వేల మంది నా మనుషులే ఉన్నారని కరుణాకరరెడ్డి ప్రకటిస్తే ఉద్యోగులు స్పందించకపోవడం ఏమిటో అర్థం కావడం లేదన్నారు. ఇప్పటికీ టీటీడీలో కొంత మంది ఉద్యోగులు వైసీపీకి కొమ్ము కాస్తున్నారన్నది బహిర్గతమైందన్నారు. భూమన మనుషులే తల్లిలాంటి టీటీడీని భ్రష్టుపట్టిస్తున్నారని మండిపడ్డారు. కరుణాకరరెడ్డి ఉద్యోగుల గురించి చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండు చేశారు. సమావేశంలో టీడీపీ నేతలు కరాటే చంద్ర, సుబ్బు యాదవ్, గంజి సుధాకర్ రెడ్డి, నాగ ప్రతాప్ పాల్గొన్నారు

పథకం ప్రకారమే హత్య!

● యాస్మిన్ మృతిలో కుటుంబ సభ్యులదే పాత్ర
● పరారీలో తండ్రి, సోదరులు
● మతాంతర వివాహం చేసుకోవడమే కారణం


యాస్మిన్,సాయితేజ్ వివాహ చిత్రం

చిత్తూరు అర్బన్,ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): చిత్తూరు నగరంలోని బాలాజీనగర్ కాలనీలో సోమవారం జరిగిన అనుమానాస్పద మృతిని పోలీసులు పరువు హత్యగా దాదాపు నిర్ధారణకు వచ్చినట్లు తెలుస్తోంది. మతాంతర వివాహం చేసుకుందన్న కక్షతో యాస్మిన్‌ను ఆమె తండ్రి, ఇద్దరు సోదరులు కలిసి అంతమొందించి పరారయ్యారు. అయితే యాస్మిన్‌ను హత్య చేయాలని ముందే కుటుంబ సభ్యులు ప్లాన్ చేసుకున్నట్లు పోలీసుల అదుపులో ఉన్న వారి దగ్గరి బంధువు చెప్పినట్లు తెలుస్తోంది. పోస్టుమార్టం నివేదిక వచ్చాక పూర్తి వివరాలు వెల్లడి కానున్నాయి. చిత్తూరు బాలాజీనగర్ కాలనీలో నివాసముంటున్న ఆర్ఎంపీ షౌకత్‌ఆలీ,ముంతాజ్ దంపతులకు ముగ్గురు కుమార్తెలు.చిన్న కూతురు యాస్మిన్(26) ఎంబీఏ పూర్తి చేసింది. కాలేజీలో ప్రేమించిన పూతలపట్టు మండలం పోటుకనుమకు చెందిన సాయితేజ్‌ను పెళ్లి చేసుకోవాలని నిర్ణయించుకుంది.సాయితేజ్ దళితుడని ఇంట్లో తెలిసి తల్లిదండ్రులు యాస్మిన్‌కు వేరొకరితో పెళ్లి నిశ్చయించారు. పెళ్లికి మూడు రోజులు ముందు ఇంట్లో నుంచి వెళ్లిపోయిన యాస్మిన్ ఫిబ్రవరి 9వ తేదీన నెల్లూరులో సాయితేజ్‌ను పెళ్లి చేసుకుంది.తమ కూతురు కన్పించడం లేదని అప్పట్లో యాస్మిన్ తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు కూడా చేశారు.వారితో ప్రాణహాని ఉందని గుర్తించిన యాస్మిన్, సాయితేజ్ తిరుపతి పోలీసులను ఆశ్రయించారు. ఇరు కుటుంబాల వారిని పోలీసులు పిలిపించి సర్ది చెప్పి పంపించారు. అప్పటి నుంచి రెండు నెలల వరకు ఎలాంటి ఇబ్బందుల్లేకుండా వీరి సంసారం సాగింది.

తండ్రికి ఆరోగ్యం బాలేదని పిలిపించి..

యాస్మిన్ పెళ్లితో కుటుంబ పరువు పోయిందని భావించిన షౌకత్‌ఆలీ కుటుంబ సభ్యులు ఆమెపై కక్ష పెంచుకున్నారు. పూర్తిగా విచక్షణ కోల్పోయి ఆమె ప్రాణం తీసేందుకు ప్లాన్ చేశారు.యాస్మిన్ పెళ్లి తర్వాత తండ్రి షౌకత్‌ఆలీ డిప్రెషన్‌కు గురయ్యారని, రోజురోజుకూ ఆయన ఆరోగ్యం క్షీణిస్తుందని ఫోన్లో పలుమార్లు మాట్లాడారు. ఒకసారి వచ్చి చూస్తే ఆయన బాగవుతారని నమ్మించారు. దాంతో ఆమె భర్త సాయితేజ్‌ను అడగ్గా.. అత్తారింటి గురించి తెలిసిన వ్యక్తిగా వద్దని వారించాడు. పదేపదే పిలుస్తుండడంతో యాస్మిన్ కూడా ఒక్కసారి వెళ్లొస్తానని అడగడంతో విధి లేని పరిస్థితిలో ఆదివారం ఉదయం 11.45 గంటల ప్రాంతంలో చిత్తూరు గాంధీ విగ్రహ కూడలి వద్దకు యాస్మిన్‌ను తీసుకొచ్చాడు.అక్కడినుంచి యాస్మిన్‌ను ఆమె పెద్దమ్మ కుమారుడు లాలూ సాహెబ్ ఇంటికి తీసుకెళ్లాడు. వచ్చిన 20 నిమిషాల్లోపే ముందుగా అనుకున్న పథకం ప్రకారం యాస్మిన్‌ను గొంతు నులిమి చంపేశారు.తన భార్యకోసం సాయితేజ్ కాల్ చేయగా లిఫ్ట్ చేయలేదు.దీంతో ఆందోళన చెందిన సాయితేజ్ నేరుగా అత్తగారింటికి వెళ్లి తన భార్య గురించి అడిగాడు. యాస్మిన్ ఉరేసుకుని చనిపోయిందని, ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారని యాస్మిన్ అక్క నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో సాయితేజ్ హడావిడిగా ఆసుపత్రిలోని ఎమర్జెన్సీ విభాగంలోకి వెళ్లాడు.చివరకు మార్చురీలో మృతదేహం ఉందని తెలిసింది. పోస్టుమార్టం సందర్భంగా యాస్మిన్ మెడ కింద గాయాన్ని వైద్యులు నిర్ధారించారు.పోస్టుమార్టం పూర్తయ్యాక సోమవారం సాయంత్రం శవాన్ని అప్పగించడంతో సాయితేజ్ సొంతూరుకు తీసుకెళ్లి అంత్యక్రియలు చేశారు.

పోలీసుల అదుపులో దగ్గరి బంధువు

యాస్మిన్ మృతి కేసులో తండ్రి, ఇద్దరు సోదరులు పరారయ్యారు. ఈ నేపథ్యంలో పోలీసులు ఆ కుటుంబ దగ్గరి బంధువును అదుపులోకి తీసుకున్నారు. యాస్మిన్ మృతి విషయంలో ఏం జరిగిందని, నిందితులు ఎక్కడున్నారని విచారిస్తున్నారు. యాస్మిన్‌ను చంపాలని ముందే ప్లాన్ చేసుకుని పిలిపించినట్లు పోలీసుల అదుపులోని వ్యక్తి అంగీకరించినట్లు తెలుస్తోంది. చంపింది నిజమే కానీ, ఎలా చంపారనేది పోలీసులు ఇంకా నిర్ధారణకు రావడం లేదు. పరారీలో ఉన్న ముగ్గురు నిందితులు దొరికితేనే విషయం తెలుస్తుందని పోలీసులు చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సు పాసుల జారీ కేంద్రం పునఃప్రారంభం



బస్సు పాసుల జారీ కేంద్రాన్ని పునఃప్రారంభిస్తున్న డీపీటీవో

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): సీబీఎస్‌లోని ఏడుకొండల బస్టాండులో ఆధునికీకరించిన ఆర్టీసీ బస్సు పాసుల జారీ కేంద్రాన్ని ప్రజా రవాణాధికారి జి.నరసింహులు మంగళవారం పునఃప్రారంభించారు. గతంలో ఎలక్ట్రిక్ బస్సు ఛార్జింగ్ స్టేషన్‌కు అభిముఖంగా ఉన్న కారణంగా ప్రయాణికులకు అసౌకర్యంగా ఉండేది. ప్రయాణీకుల విజ్ఞప్తి మేరకు ఆర్టీసీ యంత్రాంగం కౌంటర్‌ను అదే భవనంలో లోపలివైపునకు మార్పు చేసి, మంగళవారం నుంచి అందుబాటులోకి తీసుకువచ్చింది. దీంతో పాసులు పొందేందుకు వచ్చే వారు కూడా హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం విశ్వనాథం, ఏటీఎం రామచంద్ర నాయుడు, చంద్రయ్య, ఈ.ఆర్.కుమార్, నరసింహులయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్ ఫలితాల్లో సంస్కృతి విద్యార్థుల జయకేతనం



జితేష్

తిరుచానూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ఇంటర్ ఫలితాల్లో తిరుచానూరు సంస్కృతి కళాశాల విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరచినట్లు ఆ సంస్థల డైరెక్టర్ ప్రణీత్ తెలిపారు. ద్వితీయ సంవత్సర ఫలితాల్లో సి.కె.జితేష్ 991/1000 మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో 2వ స్థానం, తిరుపతి జిల్లాలో మొదటిస్థానం సాధించాడు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సర ఫలితాల్లో 50శాతం పైగా విద్యార్థులు 90శాతం మార్కులు సాధించారని తెలిపారు. ఈ ఫలితాలు సాధించిన విద్యార్థులు, అందుకు కృషి చేసిన అధ్యాపకులను సంస్కృతి విద్యాసంస్థల ఛైర్‌పర్సన్ సులోచన, డైరెక్టర్ ప్రణీత్ అభినందించారు.

ఆర్టీసీ బస్టాండులో అగ్నిప్రమాదాలపై అవగాహన



తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వేసవి దృష్ట్యా సెంట్రల్ బస్సుస్టేషన్‌లో అగ్నిప్రమాదాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా తిరుపతి కేంద్రం ఆధ్వర్యంలో సిబ్బంది ఫైర్‌ఇంజన్‌తో మంగళవారం ఉదయం బస్టాండుకు చేరుకొన్నారు. దుకాణాలు, హోటల్స్ నిర్వాహకులను రప్పించి గ్యాస్‌సిలిండర్ లీకేజ్‌తో చెలరేగే మంటలను అదుపు చేసే విధానాన్ని చేసి చూపించారు. అనంతరం నీటిపైపులను ఏర్పాటుచేసి నీరు చిమ్మే విన్యాసాలను కళ్లకు కట్టినట్టు చూపించారు. దాదాపు అర్ధగంట పాటు ప్రదర్శించిన ఈ విన్యాసాలు ప్రయాణీకులను ఆకట్టుకున్నాయి.

బస్టాండులో ఏటీఎంల అవుటాఫ్ సర్వీస్



మూతబడిన ఎస్బీఐ ఏటీఎం

తిరుపతి(ఆర్టీసీ), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బస్టాండు ఆవరణలో ఉన్న ఏటీఎంలు అవుట్ ఆఫ్ సర్వీస్, నో క్యాష్ బోర్డులతో దర్శనమిస్తున్నాయి. వరుసగా బ్యాంకు సెలవులు రావడంతో శుక్రవారం నింపిన నగదు శని, ఆదివారాల్లోనే అయిపోయింది. దీంతో సోమవారం సెలవు కావడంతో నగదు నింపలేకపోయారు. అదే రోజున అన్ని ఏటీఎంలకు బోర్డులు పెట్టేశారు. అయితే మంగళవారం పనిదినమైనా బ్యాంకు యాజమాన్యాలు స్పందించలేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. మధ్యాహ్నం 2 గంటల వరకు కూడా బోర్డులతోనే కనిపించడంతో ప్రయాణీకులు, ప్రజలు తీవ్ర అసంతృప్తి చెందారు. పనిదినాల్లో కూడా ఏటీఎంలలో నగదు నిల్వ లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

నేడు పద్మావతి వర్సిటీకి ఐఎస్‌వో నిపుణుల బృందం రాక

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పద్మావతి మహిళా యూనివర్సిటీకి బుధవారం ఐఎస్‌వో నిపుణుల బృందం రానుంది. రెండు రోజుల పాటు ఈ బృందం యూనివర్సిటీ పాటిస్తున్న బోధన, పరిశోధన, విస్తరణ, వసతి, పాలన, సేవలు వంటి అంశాల్లో ప్రమాణాలను పరిశీలించనుంది. ఐఎస్‌వో సర్టిఫికేషన్ వల్ల యూనివర్సిటీ మరింత గుర్తింపును సంతరించుకుంటుందని ఇంటర్నల్ క్వాలిటీ అష్యూరెన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ టి.త్రిపురసుందరి తెలిపారు.

భాస్కర్ యాదవ్‌కు పూలే పురస్కారం



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు బి.భాస్కర్ యాదవ్ మహాత్మాజ్యోతిబా పూలే పురస్కారాన్ని పొందారు. బీసీ విద్యార్థులు, ప్రజా సమస్యల పరిష్కారానికి సుదీర్ఘ కాలంగా చేసిన కృషికి గుర్తింపుగా ఈ పురస్కారాన్ని అందించారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, యాదవ కార్పొరేషన్ రాష్ట్ర ఛైర్మన్ నరసింహ యాదవ్, బీసీ ఉద్యోగ నేత గోపాల్ చేతుల మీదుగా శాలువా, పుష్పగుచ్ఛం, జ్ఞాపిక, ధ్రువీకరణ పత్రంతో సత్కరించారు. పూలే ఆలోచనలతో బీసీల ఉన్నతి కోసం మరింత నిబద్ధతతో పని చేస్తానని ఈ సందర్భంగా భాస్కర్ యాదవ్ పేర్కొన్నారు. పలువురు బీసీ విద్యార్థి, ఉద్యోగ నేతలు ఆయన్ను అభినందించారు.



నిమ్మకాయల అలంకరణలో అమ్మవారు



దర్శించుకుంటున్న భక్తులు

తాతయ్యగుంట గంగమ్మకు

తొలివారం విశేషాలంకరణ

● ఏర్పాట్లను పరిశీలించిన నగర కమిషనర్

తిరుపతి(కల్చరల్), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర ముందు మూడు వారాల్లో తొలి మంగళవారం ప్రారంభమైంది. ఉదయం అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలను అర్చకులు నిర్వహించారు. అనంతరం నిమ్మకాయలతో గంగమ్మను అలంకరించి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. తొలి వారం కావడంతో భక్తులతో ఆలయం కిటకిటలాడింది. మహిళలు పొంగళ్లు, నైవేద్యాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు.

జాతర ఏర్పాట్ల పరిశీలన

గంగ జాతరను పురస్కరించుకుని చేపట్టాల్సిన ఏర్పాట్లపై కమిషనర్ మౌర్య మంగళవారం పరిశీలించి, అధికారులకు పలు సూచనలు చేశారు. నగరపాలక సంస్థ తరఫున చేయాల్సిన ఏర్పాట్లు, భక్తులకు తాగు నీరు, వాహనాల పార్కింగ్, క్యూలైన్ల నిర్వాహణ, మార్కెట్‌లో పొంగళ్లు పెట్టడానికి కావాల్సిన సౌకర్యాలు, మెడికల్ క్యాంప్‌లు, పారిశుధ్యంపై ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ఆర్‌సీ మునికృష్ణ, ఆలయ ఈవో జయకుమార్ పాల్గొన్నారు.



వెయ్యికళ్ల దుత్తతో మొక్కులు చెల్లించుకుంటున్న యువతి



జాతర ఏర్పాట్లను పరిశీలిస్తున్న కమిషనర్, డిప్యూటీ మేయర్

చేతి వృత్తులతో ఆర్థికాభివృద్ధి సాధ్యం



శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న రాస్ డైరెక్టర్ నాగరాజు

తిరుపతి(ఆటోనగర్), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మహిళలు చేతివృత్తుల ద్వారా నైపుణ్యాన్ని ప్రదర్శించి ఆర్థికాభివృద్ధి సాధించవచ్చని రాస్ పొదుపు సంఘాల డైరెక్టర్ వి.నాగరాజు అన్నారు. తిరుపతి కొరమేనుగుంటలో వున్న రామాలయంలో మంగళవారం రాష్ట్రీయ సేవా సమితి(రాస్) ఆధ్వర్యంలో ఘనంగా శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో రాస్ పొదుపు సంఘాల మహిళలు పూజలు చేశారు. అనంతరం నాగరాజు మాట్లాడుతూ సమాజంలో ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించడం వల్ల మహిళల్లో ఐక్యతభావాలు ఏర్పడి సంతోషంగా ఉంటారన్నారు. తమ సంస్థ మహిళలకు చేతివృత్తుల్లో శిక్షణ ఇచ్చి వ్యక్తిగత ఆర్థికావృద్ధి సాధించేలా చేయూతనిస్తుందని చెప్పారు. అనంతరం శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.పేద వృద్ధులకు దుప్పట్లు, చేతికర్రలు, వాకర్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో సత్యనారాయణ, రమాదేవి, కవిత, వాణి, దేశమ్మ, మౌనిక, లావణ్య, సుజాత తదితరులు పాల్గొన్నారు.

హిందీపై ఉద్యోగులకు శిక్షణ



ఉద్యోగులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న వీసీ

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సంస్కృత యూనివర్సిటీ నాన్ టీచింగ్ ఉద్యోగులకు హిందీ భాషపై శిక్షణా కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. హిందీ భాషా నైపుణ్యాలపై వారికి నిపుణులు అవగాహన కల్పించారు. ఉద్యోగులకు వీసీ ప్రొఫెసర్ కృష్ణమూర్తి సర్టిఫికెట్లు అందజేశారు. హిందీ భాషా ప్రావీణ్యాన్ని ఉద్యోగులు పెంపొందించుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

విజ్ఞానవంతులుగా ఎదగాలి: డీఈవో



ఐఎన్‌టీఎస్‌వోలో బహుమతులు గెలుపొందిన విద్యార్థులతో డీఈవో కేవీఎన్ కుమార్, ఏజీఎం సురేష్ తదితరులు

తిరుపతి(విద్య), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు అంతకంతకూ మరింత విజ్ఞానాన్ని సముపార్జించి విజ్ఞానవంతులుగా ఎదగాలని డీఈవో కేవీఎన్ కుమార్ సూచించారు. ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ 2024-25 ఫైనల్స్‌లో స్థానిక శ్రీచైతన్య టెక్నోస్కూల్స్ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచి అనేక బహుమతులు గెలుచుకున్నారు. పాఠశాలలో మంగళవారం జరిగిన బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమానికి డీఈవో ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు బహుమతులు అందజేసి అభినందించారు. డీఈవో మాట్లాడుతూ... జాతీయ స్థాయిలో జరిగిన టాలెంట్ సెర్చ్ పోటీల్లో శ్రీచైతన్య టెక్నో విద్యార్థులు ఏకంగా 24 మంది విజేతలుగా నిలవడం అభినందనీయమన్నారు. ఏజీఎం సురేష్ మాట్లాడుతూ... జాతీయ స్థాయి పోటీల్లో తమ విద్యార్థులు 5 లాప్‌టాప్‌లు, 19 టాబ్‌లు గెలుపొందారంటూ విద్యార్థులను, వారికి శిక్షణ ఇచ్చిన ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో వివిధ బ్రాంచీల ప్రధానోపాధ్యాయులు, డీన్లు, కోఆర్డినేటర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

వృద్ధుడికి దేహశుద్ధి



పోలీసుస్టేషన్‌లో వృద్ధుడు

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మంగళం పరిధిలోని రణధీరపురానికి చెందిన ఓ వృద్ధుడికి స్థానికులు దేహశుద్ధి చేశారు. స్థానికుల వివరాల మేరకు... 10వ లైనులో నివాసముంటున్న సెల్వం(60) చిన్న వ్యాపారాలు చేసుకుంటూ జీవిస్తున్నాడు. గత మూడ్రోజులుగా తన వద్ద ఉన్న మొబైల్‌ఫోన్ ద్వారా చుట్టుపక్క పిల్లలకు అశ్లీల చిత్రాలు చూపుతూ అసభ్యంగా ప్రవర్తిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం సాయంత్రం కూడా ఇదే పనిలో ఉండటంతో తల్లిదండ్రులు వీధిలోనే ఆడుకునే పిల్లలు కనబడకపోవడంతో అనుమానంతో వృద్ధుడి ఇంట్లోకి ప్రవేశించారు. అశ్లీల చిత్రాలు చూపుతున్నట్లు గుర్తించి వృద్ధుడికి అక్కడికక్కడే దేహశుద్ధి చేశారు. అనంతరం పోలీసులకు అప్పగించి వృద్ధుడిని కఠినంగా శిక్షించాలని తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు.

ఎంఆర్‌పల్లె స్టేషన్ వద్ద అగ్ని ప్రమాదం



మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ పరిధిలోని ఎంఆర్‌పల్లె పోలీస్‌స్టేషన్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం స్వల్ప అగ్ని ప్రమాదం చోటుచేసుకుంది. స్టేషన్ పక్కన ఉన్న ముళ్ల పొదలు, చెట్లు, ఇతర పాడైన వస్తువులు పడి ఉండటంతో గుర్తుతెలియని వ్యక్తులు వాటికి నిప్పు పెట్టారు. దీంతో ఒక్కసారిగా మంటలు పెద్ద ఎత్తున చెలరేగాయి. స్థానికులు గమనించి తిరుపతి అగ్నిమాపక శాఖ అధికారులకు సమాచారం అందించారు. అగ్నిమాపక శాఖ డివిజన్ స్థాయి అధికారి కిరణ్‌కుమార్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది హుటాహుటిన వెళ్లి మంటలపై నీళ్లు చల్లి అదుపుచేశారు. లేకుంటే పక్కనే ఉన్న చిన్న, చిన్న గుడిసెలు, దుకాణాలకు మంటలు వ్యాపించి ఉండేవి. ఈఘటనపై అగ్నిమాపక శాఖ అధికారులు కేసు నమోదు చేశారు.

నవీన్ కుటుంబానికి ఎంపీ పరామర్శ

తిరుపతి(జీవకోన), ఏప్రిల్ 14(ఆంధ్రజ్యోతి): బీజేపీ నేత నవీన్ కుమార్‌రెడ్డి కుటుంబాన్ని ఎంపీ గురుమూర్తి మంగళవారం పరామర్శించారు. ఇటీవల నవీన్ మాతృమూర్తి అకాల మరణం చెందిన విషయం విదితమే.

రాత్రి గస్తీలు పటిష్ఠంగా చేయాలి: డీఎస్పీ

తిరుపతి(నేరవిభాగం) ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పోలీసులు రాత్రి గస్తీలు పటిష్ఠంగా నిర్వహిస్తే ఎక్కడా ఘర్షణలు, దొంగతనాలకు తావుండదని డీఎస్పీ భక్తవత్సలం అన్నారు. డీఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తన కార్యాలయంలో మంగళవారం రాత్రి 4 సర్కిళ్ల పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలతో సమావేశం నిర్వహించారు. ఎస్పీ హర్షవర్ధన్ రాజు ఆదేశాల మేరకు విజబుల్ పోలీసింగ్ ప్రతిరోజు క్రమం తప్పకుండా నిర్వహించాలని చెప్పారు. తిరుపతి సబ్‌డివిజన్ జిల్లాలో ఆదర్శంగా నిలవాలన్నారు. మద్యం షాపులు, బార్‌లు సమయ పాలన పాటించాలని స్పష్టం చేశారు. ఎప్పటికప్పుడు జరిగే నేరాలను తమ దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో సీఐలు రామ్‌కిషోర్, రామకృష్ణ, మురళీమోహన్, రామయ్య, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

శ్రీసిటీలో 'వందే భారత్' స్లీపర్ బోగీల ఇంటీరియర్ పనులు

శ్రీసిటీ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): 'వందే భారత్' స్లీపర్ ఎక్స్‌ప్రెస్ కోసం వివిధ వ్యవస్థలను రూపొందించడం, రైలు పెట్టెల్లో అమర్చడం వంటి ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును తిరుపతి జిల్లా శ్రీసిటీలోని బీఎఫ్‌జీ ఇండియా చేపట్టింది. ఈ ప్రాజెక్టులో 16 కోచ్‌ల రైలు కోసం ఇంటీరియర్స్, మాడ్యులర్ టాయిలెట్ క్యాబిన్లు, ఏరోడైనమిక్ ఫ్రంట్ ఎండ్‌ల రూపకల్పన, తయారీ, ఇన్‌స్టాల్ చేయడం వంటి పనులను ఈ కంపెనీకి అప్పగించారు. ఈ రైలులో 823 బెర్త్‌లు, 51 టాయిలెట్లు ఉంటాయి. కాగా, ప్రపంచస్థాయి ప్రమాణాలతో తేలికైన, మన్నికైన ఉత్పత్తులతో రైల్వే మౌలిక సదుపాయాలను కల్పించే విప్లవాత్మక వందే భారత్ స్లీపర్ ప్రాజెక్టులో భాగం కావడం తమకు గర్వకారణమని బీఎఫ్‌జీ ఇండియా వైస్ ప్రెసిడెంట్ కె.ప్రేమమూర్తి తెలిపారు.



జస్టిస్ మురళీ పురుషోత్తమన్

శ్రీవారి సేవలో ప్రముఖులు

తిరుమల, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారిని మంగళవారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. వారిలో.. కేరళ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మురళీ పురుషోత్తమన్, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఉన్నారు.



పరిటాల సునీత

సర్వదర్శనానికి 11 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 11 గంటల సమయం పడుతోంది. మంగళవారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లోని అన్ని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ టీబీసీ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 4 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

ఆదివారం హుండీ ఆదాయం: రూ.3.58 కోట్లు

సోమవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 73,078

తలనీలాలు సమర్పించినవారు: 25,831



తిరుపతి కళాకారులకు 'కందుకూరి' అవార్డులు

- శాంభోళ హరినాథ్, కృష్ణమూర్తి, వివేక్ ఎంపిక
- నేడు విజయవాడలో పురస్కారాల ప్రదానం

తిరుపతి, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ చలనచిత్ర, టీవీ, నాటక రంగ అభివృద్ధి సంస్థ (ఏపీఎఫ్‌డీసీ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తున్న కందుకూరి అవార్డులకు తిరుపతికి చెందిన ముగ్గురు రంగస్థల కళాకారులు ఎంపికయ్యారు. కందుకూరి వీరేశలింగం పంతులు 177వ జయంతి వేడుకలు, తెలుగు నాటక రంగ దినోత్సవం సందర్భంగా జిల్లా స్థాయి పురస్కారాలకు శాంబోళ హరనాథ్, కృష్ణమూర్తి, పత్తిపాటి వివేక్‌ను ఎంపిక చేసినట్టు మంగళవారం ఏపీఎఫ్‌డీసీ ప్రకటించింది. విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో బుధవారం జరిగే తెలుగు నాటకరంగ దిన వేడుకల్లో సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పురస్కారాలు అందజేయనున్నారు. ఒక్కొక్కరికి రూ10వేలు జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సన్మానించనున్నారు.

భళా శాంభోళ



శాంభోళ హరినాథ్ ప్రభుత్వ విశ్రాంత ఉపాధ్యాయుడు. కానీ, ఆయన కళాకారుడిగానే అందరికీ పరిచయం. 1976లోనే వేషం వేసుకుని ప్రథమ బహుమతి పొందారు. హాస్యాన్ని అలవోకగా, ఆశువుగా చెప్పగల చమత్కారి. అతను వేదిక ఎక్కితే నవ్వువచ్చేస్తుంది. అలాగని హాస్యానికే పరిమితం కాలేదు. కొన్ని సాంఘిక నాటికల్లో కన్నీరు తెప్పించిన అనేక పాత్రలను పోషించి విభిన్న నటుడిగా గుర్తింపు పొందారు. బెస్ట్ కమెడియన్‌గా అవార్డులు అందుకున్నారు. ఆయనకు వచ్చిన జ్ఞాపికల కోసం ఓ గదిని అద్దెకు తీసుకొని, అందులో అందంగా పేర్చి వాటిని చూసుకుంటూ ముచ్చటపడుతుంటారంటే రంగస్థలంపై ఆయనకున్న ప్రేమను తెలియజేస్తుంది.

కళా కృష్ణమూర్తి



ఎంకాం, ఎంబీఏ పూర్తిచేసి స్విమ్స్ కాంట్రాక్ట్ ఉద్యోగిగా ఉన్నారు. అక్కడ పనిచేసే 8 గంటలూ రోగుల సేవలోనే ఉంటారు. బయటకు వస్తే నటన గురించే ఆలోచిస్తారు. తొలినాటకం 'భక్త కన్నప్ప'లో నటించారు. 'పాండవోద్యోగ విజయం'లోని ఉపప్లావ్య ఘట్టంలో తొలిసారిగా కృష్ణుడి పాత్ర వేశారు. చెంచితలో చెంచునాయుడు పాత్రలో కృష్ణమూర్తి ఒదిగిపోయారు. 'తరిగొండ వెంగమాంబ' నాటకంలో శివగురు పాత్రతో విలనిజం చూపించారు. బుల్లితెరపై మొగలిరేకులు, హరిలోరంగహరి, కుమ్మరి భీమన్న, భీష్మ, అపార్ట్‌మెంట్ వంటి సీరియల్స్ చేశారు. పేరుకు తగ్గట్టే శ్రీకృష్ణుడు, కుసాలన్న పాత్ర, కాళహస్తి మహత్యంలో కాశీపాత్ర (హాస్యం) గుర్తింపు తెచ్చాయి. తరిగొండ వెంగమాంబ, పాండవోద్యోగం నాటకాలు పేరు తెచ్చాయి.

మైమ్ స్టార్ వివేక్



శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ సాంస్కృతిక కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్. విద్యార్థిగా ఉన్నప్పుడే మైమ్‌స్టార్‌గా పేరుతెచ్చుకున్నారు. 2022లో 'నాటిక' రచనకు బంగారు నంది అవార్డు అందుకున్నారు. విశ్వవిద్యాలయాల మధ్య జరిగే అనేక సాంస్కృతిక పోటీల్లో వివేక్ ప్రదర్శన ప్రత్యేక ఆకర్షణగా ఉండేది. మైమ్ ద్వారా అద్భుతమైన సందేశాలిచ్చేవారు. ఇటీవల వర్సిటీలో సాంస్కృతిక పోటీలు నిర్వహించారు. అందులోని విజేతలను, దక్షిణ భారత విశ్వవిద్యాలయాల్లో ఎస్వీయూను అగ్రస్థానంలో నిలిపారు. ఎస్వీయూ చరిత్రలో ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచారు.

ధాన్యంపైనా సూర్యప్రతాపం

- అధిక ఉష్ణోగ్రతల్లో ఆరబెడితే నష్టమే
- అధికంగా ఎండితే బియ్యం ముక్కలయ్యే అవకాశం
- కొంత పచ్చిగా ఉన్నప్పుడే పంటకోత మేలంటున్న వ్యవసాయ అధికారులు



తేమ శాతం తగ్గించేందుకు ఎండలో ఆరబెట్టిన ధాన్యం


సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తూర్పు మండలాల్లో రబీ వరి కోతలు ప్రారంభమయ్యాయి. ధాన్యం అమ్మకాలకు రైతులు సిద్ధపడుతున్నారు. 17 శాతం వరకు తేమ ఉన్న ధాన్యాన్ని గిట్టుబాటు ధరకు కొనుగోలు చేసేందుకు రైతు భరోసా కేంద్రాల్లో (ఆర్‌బీకే) కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభించింది. ఈ నేపథ్యంలో పచ్చిగా ఉన్నప్పుడే అమ్మకుంటే గిట్టుబాబు ధర రాదని భావిస్తున్న రైతులు.. ధాన్యాన్ని ఎండలో బాగా ఆరబెట్టి తేమను తొలిగించే పనిలో పడ్డారు. కోత దశకు వచ్చిన పంటను కోత కోసి వచ్చిన ధాన్యాన్ని ఆరబెడుతున్నారు. సరిగ్గా ఇదే తరుణంలో ఈ ఏడాది మార్చి నుంచే ఎండల తీవ్రత అధికంగా ఉంటోంది. సూళ్లూరుపేట ప్రాంతంలో దాదాపు 35 నుంచి 40 డిగ్రీల సెల్సియస్ వరకూ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇటువంటి వాతావరణ పరిస్థితుల్లో ధాన్యం అధికంగా ఎండిపోయే అవకాశం ఉంటుంది. ఇదే జరిగితే బియ్యం ముక్కలయ్యే అవకాశం ఏర్పడుతుందని వ్యవసాయ అధికారులు చెబుతున్నారు. దీని వల్ల రైస్ మిల్లర్లు ధాన్యం తీసుకోవడానికి నిరాకరించే అవకాశాలు ఉంటాయని చెబుతున్నారు.

ఈ జాగ్రత్తలు తప్పనిసరి

- వరి కంకుల్లో 90 శాతం గింజలు పసుపు రంగుకు మారుతున్నప్పుడు, కర్ర పచ్చిగా ఉండగానే పంట కోయాలి.
- పంట పక్వానికి వచ్చాక కోత ఆలస్యం చేయకూడదు.
- పంటను ముందుగా కోస్తే ధాన్యంలో పచ్చి గింజలు ఎక్కువగా ఉండి మిల్లింగ్ సమయంలో అధికంగా నూక వస్తుంది.
- ఎండ తక్కువ తగిలే చోట ధాన్యాన్ని ఆరబెట్టుకోవాలి.
- 17 శాతం తేమ ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ధాన్యం ఎక్కువగా ఎండినా బియ్యంలో నూక శాతం ఎక్కువ అవుతుంది.



ఆరబెట్టేందుకు ట్రాక్టర్‌లో తీసుకొచ్చి పోస్తున్న ధాన్యం



ఆరిన ధాన్యం రాశులు

విజబుల్ పోలీసింగ్‌లో నిర్లక్ష్యం వహిస్తే సహించను

పనితీరు మార్చుకోని వారిపై కఠిన చర్యలు ● అధికారుల సమీక్షా సమావేశంలో ఎస్పీ హెచ్చరిక



పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్తున్న ఎస్పీ

తిరుపతి(నేరవిభాగం), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'ప్రజల్లో పోలీసుల పట్ల నమ్మకం పెరగాలంటే విజబుల్ పోలీసింగ్‌ను బాధ్యతగా నిర్వహించాలి. ఈ విషయంలో కొందరు నిర్లక్ష్యం వహిస్తున్నారు. వారు పనితీరు మార్చుకోకుంటే కఠిన చర్యలు తప్పవు' అని ఎస్పీ హర్షవర్ధనరాజు హెచ్చరించారు. తిరుపతిలో మంగళవారం ఆయన జిల్లాలోని అదనపు ఎస్పీలు, డీఎస్పీలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ప్రజలతో మమేకమయ్యే కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ముఖ్యంగా ఓపెన్ బూజింగ్, పరిసరాల పరిశుభ్రత, విజబుల్ పోలీసింగ్, పల్లెనిద్ర, ప్రజా ఫిర్యాదుల కార్యక్రమం, పార్కుల్లో వాకింగ్ చేస్తున్న వృద్ధులతో పోలీసు కార్యక్రమాలను ప్రతిరోజు పక్కాగా నిర్వహించాలన్నారు. వీటిపై ఎలాంటి స్పందన వస్తోందనేది డీఎస్పీలను అడిగి తెలుసుకున్నారు. రాంగ్ రూట్‌లో వెళుతున్న వారిపట్ల కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. అసాంఘిక కార్యకలాపాలు నిర్వహించే వారిపట్ల ఉదాసీనంగా వ్యవహరిస్తే వారు సంఘ వ్యతిరేక శక్తులుగా మారతారన్నారు. ప్రజలకు మనోధైర్యం కల్పించేలా పనిచేయాలే కానీ ఇబ్బంది పెట్టేవిధంగా కాదని పోలీసులకు సూచించారు. సబ్ డివిజన్ల పరిధిలో నమోదవుతున్న.. పెండింగ్ కేసులపై ఆరాతీశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న కేసులు ఎందుకు ఛేదించలేకపోతున్నారని ప్రశ్నించారు. అన్ని దేవాలయాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. వేసవి దొంగతనాలపై ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమయం దాటాక ఎవరైనా మద్యం తాగుతూ కనిపిస్తే పోలీస్ ట్రీట్‌మెంట్ గట్టిగా ఇవ్వాలన్నారు. నైట్‌బీట్ సిబ్బంది నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవన్నారు. శక్తి యాప్‌పై నిర్వహించే అవగాహన కార్యక్రమాల గురించి తెలుసుకున్నారు. త్వరలో సిబ్బందిని పారదర్శకంగా బదిలీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీలు వెంకట్రావు, రవిమనోహరాచ్చారి, రామకృష్ణ, డీఎస్పీలు, ఎస్బీ సీఐ షాదిక్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

తూలి కిందపడ్డ సూళ్లూరుపేట ఎమ్మెల్యే

- విజయశ్రీకి స్వల్ప గాయాలు
- శ్రీకాళహస్తి ఎమ్మెల్యే ఇంట్లో ఘటన

తడ, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ తూలి కిందపడడంతో స్వల్ప గాయాలయ్యాయి. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులో మంగళవారం జరిగిన మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకల్లో పాల్గొనేందుకు విజయశ్రీ వెళ్లారు. కారుదిగి ఇంట్లోకి వెళ్తున్న క్రమంలో ప్రధాన గడప వద్ద తూలి కింద పడిపోయారు. ముఖం నేలకు కొట్టుకుని సల్ప గాయాలయ్యాయి. ఆ సమయంలో ఇంట్లోనే ఉన్న శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి వెంటనే వచ్చి విజయశ్రీని పైకి లేపారు. గాయమైన చోట రక్తం కారుతుండడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తీసుకెళ్లగా వైద్యులు కుట్లు వేసి చికిత్స అందించారు. కొద్దిసేపు అక్కడే విశ్రాంతి తీసుకున్న విజయశ్రీ సాయంత్రం నాయుడుపేటలోని స్వగృహానికి వచ్చారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆమెను పరామర్శించారు.

ప్రాణదాన పథకానికి 194 మంది ఎంపిక

తిరుపతి(వైద్యం),ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): స్విమ్స్‌లో నిరుపేదలకు ఉచిత శస్త్ర చికిత్సలు అందించే టీటీడీ ప్రాణదాన పథకానికి 194 మంది రోగులను ఎంపిక చేశారు.స్విమ్స్‌లో టీటీడీ జేఈవో వీరబ్రహ్మం ఆధ్వర్యంలో మంగళవారం ప్రాణదాన కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కార్డియాలజీ 1, కార్డియోథొరాసిక్ 18, ఈఎన్‌టీ 8, జనరల్ సర్జరీ 1, మెడిసిన్ 12, నెఫ్రాలజీ 39, న్యూరాలజీ 23, న్యూరోసర్జరీ 29, గైనకాలజీ 23, సైకియాట్రీ 1, సర్జికల్ ఆంకాలజీ ముగ్గురు రోగులను కమిటీ సభ్యులు ఎంపిక చేశారు. పేద రోగులకు ఉచిత శస్త్ర చికిత్సలు నిర్వహించే టీటీడీ ప్రాణదాన పథకానికి దాతలు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ముందుకు వచ్చి ఆర్థిక సాయం అందిస్తే మరింత మందికి వైద్యం అందించే అవకాశం ఉంటుందని స్విమ్స్ డైరెక్టర్ ఆర్వీకుమార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఎస్ రామ్, వైద్య విభాగాధిపతులు శివశంకర్, గోపీ, నర్మద తదితరులు పాల్గొన్నారు.

నేడు అసెంబ్లీ పద్దుల కమిటీ రాక

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పర్యటన నిమిత్తం బుధవారం అసెంబ్లీ పద్దుల కమిటీ రానుందని కలెక్టర్ వెంకటేశ్వర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. అసెంబ్లీ పద్దుల కమిటీ చైర్మన్ జోగేశ్వరరావుతో పాటు 11మంది సభ్యుల బృందం బుధవారం ఉదయం 5.15గంటలకు తిరుపతి పద్మావతి అతిథి గృహం వద్దకు చేరుకుంటారన్నారు. 11గంటలకు రోడ్డు మార్గాన బయలుదేరి చిత్తూరు జిల్లాలో సమీక్షలో పాల్గొని రాత్రి 7.30గంటలకు తిరుమల చేరుకుంటారని తెలిపారు. గురువారం ఉదయం స్వామివారిని దర్శించుకుని 11.30గంటలకు తిరుపతి పద్మావతి అతిథిగృహంలో ఈవో శ్యామలరావు, ఇతర అధికారులతో సమీక్షా నిర్వహించి సాయంత్రం 5.15గంటలకు విజయవాడకు తిరుగు పయనం కానున్నట్లు కలెక్టర్ తెలిపారు.

వచ్చే విద్యా సంవత్సరం నుంచి 'స్కిట్'ను పునఃప్రారంభిస్తాం

మరో ఆరు నెలల్లో రానున్న పది పరిశ్రమలు ● మెగా జాబ్‌మేళాలో ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): 'మరో 20 రోజుల్లో 'స్కిట్' (శ్రీకాళహస్తీశ్వరా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ)లో మరమ్మతులు ప్రారంభం కానున్నాయి. వచ్చే విద్యాసంవత్సరం నుంచి స్కిట్ ఇంజనీరింగ్ కళాశాలను పునఃప్రారంభిస్తాం' అని ఎమ్మెల్యే బొజ్జల సుధీర్‌రెడ్డి అన్నారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి సందర్భంగా మంగళవారం శ్రీకాళహస్తిలో స్కిల్ డెవలప్‌మెంట్ సహాయంతో నిర్వహించిన మెగా జాబ్‌మేళాలో ఆయన మాట్లాడారు. అభివృద్ధే ఆశయంగా తుది శ్వాస వరకు ప్రజల కోసం గోపాలకృష్ణారెడ్డి పరితపించారన్నారు. 30కి పైగా ఎంఎన్‌సీ కంపెనీలతో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. శ్రీకాళహస్తి నియోజకవర్గ యువతకు స్థానిక పరిశ్రమల్లో 33శాతం ఉద్యోగావకాశాలు కల్పిస్తామని ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీ నెరవేరుస్తున్నామన్నారు. తొట్టంబేడు, శ్రీకాళహస్తి, మండలం, ఏర్పేడు, రేణిగుంటలో విస్తారంగా ప్రభుత్వ భూములున్నాయన్నారు. మరో ఆరు నెలల్లో సుమారు పది పరిశ్రమలు ప్రారంభించేలా మంత్రి లోకేశ్ కృషి చేస్తున్నారని తెలిపారు. కలెక్టర్ వెంకటేశ్వర్ మాట్లాడుతూ.. పరిశ్రమల స్థాపనతో అభివృద్ధి, ఉద్యోగాల కల్పనతో యువతకు ఉజ్వల భవిష్యత్తును అందించాలన్న తపనతో సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ దృష్టిసారిస్తున్నారని చెప్పారు. తరచూ సీఎం చంద్రబాబు కలెక్టర్ల సమావేశంలో కొత్త పరిశ్రమల కోసం భూముల పరిశీలన సాగిస్తూ ఎప్పటికప్పుడు యువతకు జాబ్‌మేళాల ద్వారా ఉద్యోగాలు ఇవ్వాలని సూచిస్తున్నట్లు తెలిపారు. త్వరలో జిల్లాస్థాయి జాబ్‌మేళా నిర్వహిస్తామన్నారు. ఈ జాబ్ మేళాకు సుమారు రెండు వేల మంది నిరుద్యోగులు వచ్చారు. 1,788మంది 33ఎంఎన్‌సీ కంపెనీలకు దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 712మందికి అప్పటికప్పుడు నియామకపత్రాలు అందాయి. 305మంది దరఖాస్తులు పరిశీలనలో ఉన్నాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరథాచారి, టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, నాయకులు చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాధంనాయుడు, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రవీంద్రారెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.





జాబ్‌మేళాకు హాజరైన అభ్యర్థులు - 2014-19లో సీఎం చంద్రబాబు, అప్పటి ఎమ్మెల్యే బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ఆధ్వర్యాన శ్రీకాళహస్తి నియోజకవర్గానికి తీసుకొచ్చిన పరిశ్రమలతో తయారు చేసిన జ్ఞాపికను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

పూలవనంలో జెర్రిపోతు



తిరుమల, ఏప్రిల్15(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శ్రీవారిసేవా సదన్‌కు సమీపంలోని పూలవనంలోకి ఏడు అడుగుల పొడవైన జెర్రిపోతు ప్రవేశించింది. గుర్తించిన కార్మికులు వెంటనే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర్‌నాయుడికి సమాచారమిచ్చారు. ఆయన పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టాడు.

పుత్తూరు వార్తలు

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

● ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్



వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

పుత్తూరు టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమం, అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ పేర్కొన్నారు. మంగళవారం మండల వ్యవసాయ కార్యాలయ ఆవరణలో వ్యవసాయ ఉపసంచాలకుడు రమేష్‌రాజు ఆధ్వర్యంలో రైతులకు పరికరాలు పంపిణీ చేశారు. 50 శాతం రాయితీతో రైతులకు కావాల్సిన యంత్రాలను అందిస్తామని చెప్పారు. పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ గంజి మాధవయ్య, పుత్తూరు మార్కెట్ కమిటీ చైర్మన్ గణేష్, పుత్తూరు ఏవో కోదండయ్య, వడమాలపేట ఏవో విజయ్‌కుమార్, సహాయకుడు మురళి పాల్గొన్నారు.

లోక్‌అదాలత్‌ను విజయవంతం చేయండి

పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గంలో కేసులు పరిష్కరించుకోవడం వల్ల సమయం, ధనం ఆదా అవుతాయని మండల న్యాయ సేవాధికార సంస్థ అధ్యక్షుడు, సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర చెప్పారు. మే 10వ తేదీన జాతీయ లోక్ అదాలత్ జరుగుతుందన్నారు. లోక్ అదాలత్ తీర్పు అంతిమ తీర్పు అని, అప్పీల్ ఉండదని తెలిపారు. ఈ లోక్ అదాలత్‌లో అన్ని రకాల సివిల్, క్రిమినల్ కేసులను రాజీ చేసుకోవచ్చన్నారు. కక్షిదారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పోలీసులు, న్యాయవాదులు లోక్ అదాలత్‌లో ఎక్కువ కేసులు పరిష్కారం అయ్యేలా చొరవ తీసుకోవాలని కోరారు.

గర్భిణులకు సకాలంలో పౌష్టికాహారం

వడమాలపేట, 15 ఏప్రిల్(ఆంధ్రజ్యోతి): గర్భిణులకు పౌష్టికాహారాన్ని సకాలంలో అందిస్తున్నట్లు ఐసీడీఎస్ సీడీపీవో ప్రమీల చెప్పారు. మంగళవారం మండల సమాఖ్య కార్యాలయంలో పోషణ పక్వాడ కార్యక్రమంపై గర్భిణులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషణ పక్వాడా ద్వారా తొమ్మిది నెలల పాటు గర్భిణికి, రెండు సంవత్సరాల వరకు పిల్లలకు పౌష్టికాహారం అందుతుందన్నారు. ఇక బాలసంజీవిని కిట్‌తోపాటు బియ్యం, కందిపప్పు, పాలు, కోడిగుడ్లు క్రమపద్ధతిలో అందిస్తామన్నారు. ఆకుకూరలు, మొలకత్తిన పప్పు దినుసులు నిత్యం తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు రోజారమణి, మనీలా, వెలుగు ఏపీఎస్ మునికృష్ణారెడ్డి, మండల సమాఖ్య, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి



పుత్తూరు అర్బన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పరమేశ్వర మంగళం సచివాలయం సమీపంలోని రహదారి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. ఈ ఘటన సోమవారం రాత్రి 10 గంటలకు జరిగింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన ఎస్‌ఐ ఓబయ్య మృతుడి వివరాలు తెలిస్తే సమాచారం ఇవ్వాలని కోరారు. మృతదేహంపై నలుపు, తెలుపు రంగు చొక్కా, తెల్ల పంచె ఉన్నాయని తెలిపారు. వయస్సు సుమారు 60 ఏళ్లు ఉండొచ్చన్నారు.

వైభవంగా సీతారాముల ఊరేగింపు

వడమాలపేట, 15 ఏప్రిల్ (ఆంధ్రజ్యోతి): మండలంలోని తట్నేరి గొల్లపల్లిలో సీతారాముల ఊరేగింపు వైభవంగా నిర్వహించారు. నవమి ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు మంగళవారం ఉదయం అభిషేకం, విశేష పూజలు నిర్వహించారు. సాయంత్రం వసంతోత్సవం, తోటోత్సవం నిర్వహించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ విగ్రహాలను పూలమాలలతో అలంకరించి మేళతాళాలు భక్తుల కోలాటాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. నారికేళ కర్పూర హారతులిచ్చారు.

యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడులో ఇండి, గ్యాప్ పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ రమేష్‌రెడ్డి, మండల వ్యవసాయాధికారి సుధాకర్‌రెడ్డి పొలాల్లో పంటలను పరిశీలించారు. రైతులకు మెరుగైన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు. రైతుల నుంచి విత్తన నమూనాలు సేకరించి వాటిని పురుగుమందుల అవశేషాల కోసం బెంగళూరు పంపించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డివిజన్ టీఏ సూర్యప్రకాష్, వీఏఏలు పవన్, పావని, కిరణ్మయి, మహేష్, రేవతి పాల్గొన్నారు.

అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రజల భాగస్వామ్యంతో అభివృద్ధి సాధ్యమని ఎంపీపీ సుబ్బలక్ష్మి తెలిపారు. మండల కేంద్రంలోని సచివాలయంలో బీఎన్‌కండ్రిగ పంచాయతీ గ్రామసభ జరిగింది. ఈ సందర్భంగా కార్యదర్శి సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ తడి, పొడి చెత్తను వేరు చేసి పారిశుధ్య కార్మికులకు ఇవ్వాలని చెప్పారు. ఇంటి పన్నులు సకాలంలో చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించాలన్నారు. ఈవోపీఆర్డీ రాజశేఖర్, సర్పంచ్ వెంకటమ్మ, ఉపసర్పంచ్ మునిరాజా తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వేపై రైతులతో సమీక్ష

● పాల్గొన్న మహారాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ

రేణిగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న భూ రీ సర్వేపై మహారాష్ట్ర ప్రిన్సిపల్ సెక్రటరీ చొక్కలింగం సేతులింగం రైతులతో సమీక్షించారు. మంగళవారం మండలంలోని గుత్తివారిపల్లి సచివాలయంలో జేసీ శుభం బన్సల్ కలిసి అనుగుంట, మల్లవరం, గుత్తివారిపల్లి రైతులతో ఆయన మాట్లాడారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న భూముల రీ సర్వే విధానాన్ని పరిశీలిస్తున్నామన్నారు. తహసీల్దార్ సురేష్ బాబు, జిల్లా భూ సర్వే సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యాచకుడి దుర్మరణం

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని యాచకుడు(50) దుర్మరణం చెందాడు. ఈ ఘటన మంగళవారం రాత్రి శ్రీకాళహస్తి పట్టణ శివార్లలోని హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద తిరుపతి రహదారిపై జరిగింది. శ్రీకాళహస్తి 1టౌన్ సీఐ గోపి తెలిపిన వివరాలు... శ్రీకాళహస్తి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు హౌసింగ్‌బోర్డు కాలనీ వద్ద తిరుపతి వైపుగా వెళుతుండగా గుర్తు తెలియని యాచకుని ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని శవపంచనామా నిర్వహించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం శ్రీకాళహస్తి ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థిని శివానికి మంత్రి లోకేశ్ అభినందన

కోట, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): కోటలోని ఏవీకేఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థిని శివాని ఎంపీసీలో 978 మార్కులు సాధించి కళాశాల టాపర్‌గా నిలిచింది. మంగళవారం గుంటూరు జిల్లా ఉండవల్లిలో జరిగిన కార్యక్రమంలో రాష్ట్రవ్యాప్తంగా ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన 52మంది విద్యార్థినులను విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అభినందించారు. ఈ సందర్భంగా శివానికి మెడల్‌తో పాటు లాప్‌టాప్ బహూకరించారు.

గూడూరు

సూళ్లూరుపేట/వెంకటగిరి

మూడు సవర్ల సరుడు అపహరణ

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లోతువానిగుంట వద్ద మహిళ మెడలో నుంచి మూడు సవర్ల సరుడు లాక్కెళ్లిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. లోతువానిగుంటలో నివాసం ఉంటున్న తులసి సమీపంలోని దుకాణానికి నడిచి వెళుతుండగా గుర్తుతెలియని వ్యక్తి మోటరు సైకిల్‌పై వచ్చిన ఆమె మెడలో ఉన్న మూడు సవర్ల సరుడు లాక్కొని పరారయ్యాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అర్బన్ సీఐ బాబి తెలిపారు.

50 శాతం వడ్డీ రాయితీతో నెలాఖరు వరకు పన్నులు చెల్లించవచ్చు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీ పరిధిలో 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తి పన్నులను 50 శాతం వడ్డీ రాయితీతో ఈనెలాఖరు వరకు చెల్లించవచ్చునని కమిషనర్ చిన్నయ్య తెలిపారు. అదే విధంగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు ఇంటి పన్నులు 5శాతం రాయితీతో చెల్లించవచ్చన్నారు.

దొంగ పట్టాలతో ప్రభుత్వ భూముల రిజిస్ట్రేషన్

వెంకటగిరి టౌన్, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో కొందరు ప్రభుత్వ భూములకు దొంగ పట్టాలు సృష్టించి రిజిస్ట్రేషన్ చేసుకుంటున్నారని కౌన్సిలర్ శంకరయ్య ఆరోపించారు. మంగళవారం సబ్ రిజిస్ట్రేషన్ కార్యాలయానికి వెళ్లిన ఆయన అక్కడ జరుగుతున్న రిజిస్ట్రేషన్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు.



జాతీయ రహదారి పక్కన ఉన్న పోగేసిన చెత్త - 15 ఎస్‌పేట 2, డంపింగ్ యార్డు నుంచి వస్తున్న పొగ

డంపింగ్ యార్డుతో పొంచివున్న ముప్పు

పట్టణ నడిబొడ్డున చెత్త పోగేయడంతో ఇబ్బందులు ● పట్టించుకోని పాలకులు, అధికారులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట పట్టణానికి డంపింగ్ యార్డుతో ముప్పు పొంచిఉంది. పట్టణ నడిబొడ్డున జాతీయ రహదారి పక్కన కాళంగి నదిని ఆనుకొని చెత్త డంపింగ్ చేస్తుండడంతో తరచూ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. మున్సిపాలిటీలోని 25 వార్డుల్లో 56 వేలకు పైగా జనాభా ఉంది. ప్రతిరోజూ దాదాపు 30 టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇదంతా హోలిక్రాస్ సమీపంలో జాతీయ రహదారి పక్కన డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. అక్కడ నుంచి దుర్వాసన వెదజల్లుతుండడంతో పట్టణం కాలుష్య కోరల్లో చిక్కుకొంటోంది. తరచూ డంపింగ్‌యార్డులో మంటలు సంభవించి పొగ పట్టణాన్ని కమ్మేస్తోంది. పొగ పీల్చడం వల్ల ఊపిరితిత్తుల సమస్యలు వస్తున్నాయని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఇదే కాకుండా డంపింగ్ యార్డు నుంచి చెత్త చెదారం పక్కనే ఉన్న కాళంగిలోకి చేరి సాగునీరంతా కలుషితమవుతోంది.

డంపింగ్ యార్డుకు స్థల సమస్య

సూళ్లూరుపేట పంచాయతీగా ఉన్నప్పుడు కాళంగి నది పక్కన డంపింగ్ యార్డు ఏర్పాటు చేశారు. మున్సిపాలిటీ స్థాయికి ఎదిగినా చెత్తంతా అక్కడే వేస్తున్నారు. డంపింగ్ యార్డును పట్టణానికి దూరంగా తరలించాలని గత పదేళ్ల నుంచి అధికారులు చేస్తున్న ప్రయత్నాలు ఫలించలేదు. రెండు, మూడు చోట్ల స్థలాన్వేషణ చేసిన కార్యరూపం దాల్చలేదు. మున్సిపాలిటీ, రెవెన్యూ అధికారుల నడుమ సమన్వయం లేకపోవడంతో స్థల సేకరణ జరగలేదు. ప్రజాప్రతినిధులు చొరవ తీసుకుని డంపింగ్ యార్డుకు స్థలం సేకరించి మార్చాల్సిన అవసరం ఉంది.

ఉపాధి పనులు చేయకనే బిల్లులు



టెక్నికల్ అసిస్టెంట్‌ను ప్రశ్నిస్తున్న పీడీ శ్రీనివాసప్రసాద్

ఇద్దరు టెక్నికల్ అసిస్టెంట్ల సస్పెన్షన్

కోట, ఏప్రిల్ 15: కోట మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో మంగళవారం ఉపాధి హామీ పనులకు సంబంధించి సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. 2023 - 24 సంవత్సరంలో మండలంలోని 21 పంచాయతీల్లో జరిగిన ఉపాధి పనుల వివరాలను డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్, ఏపీడీ వరప్రసాద్ సమక్షంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు వెల్లడించారు. పలువురు టెక్నికల్ అసిస్టెంట్లు రోడ్లకు ఇరువైపులా, పంచాయతీల్లో మొక్కలు నాటకపోయినప్పటికీ మస్టర్లు తయారు చేసి బినామీ పేర్లతో నిధులు స్వాహా చేశారని తేలింది. అంతేకాకుండా ఉపాధి పనుల వద్ద నేమ్ బోర్డులు పెట్టకుండా, ప్రింటెడ్ రికార్డులు లేకుండా మస్టర్లు తయారు చేసినట్లు వెల్లడైంది. అదేవిధంగా మినీ గోకులాన్ని లబ్ధిదారుడికి కాకుండా వేరొకరికి కట్టించినట్లు వెల్లడించారు. గూడలి పంచాయతీలో 400 మొక్కలు నాటినట్లు, కొన్ని పంచాయతీల్లో కొలతలు తక్కువ చూపి ఎక్కువ నగదు డ్రా చేసినట్లు తేలింది. ఉపాధి పనుల్లో అవకతవకలకు పాల్పడిన టెక్నికల్ అసిస్టెంట్లు శాంతి, ఏవీ భాస్కర్‌లను సస్పెండ్ చేస్తున్నట్లు పీడీ తెలిపారు. అదేవిధంగా ఏపీవో పూర్ణిమను క్రమశిక్షణ చర్యల్లో భాగంగా బదిలీ చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. పలు పంచాయతీల్లో జరిగిన అవకతవకలకు సంబంధించి క్షేత్ర సహాయకులు, టెక్నికల్ అసిస్టెంట్ల నుంచి రూ4.50 లక్షలు రికవరీ చేస్తున్నామని పీడీ తెలిపారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యం: పాశం



రైతులకు వ్యవసాయ పరికరాలను అందజేస్తున్న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్, సబ్‌కలెక్టర్ రాఘవేంద్ర మీనా

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమమే ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ అన్నారు. మంగళవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో రాయితీపై వ్యవసాయ పరికరాలను రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో రైతులకు ఉపయోగపడే కార్యక్రమాలు చేపట్టలేదన్నారు. రాయితీపై వ్యవసాయ పరికరాలను కూడా అందించలేదన్నారు. తమ ప్రభుత్వం నియోజకవర్గ పరిధిలో రైతులకు దాదాపు 103 పరికరాలను రూ.17.68 లక్షల రాయితీతో అందించడం జరిగిందన్నారు. అందులో రోటావేటర్లు, పవర్ స్ప్రేయర్లు, కల్టివేటర్లు తదితర పరికరాలు ఉన్నాయన్నారు. సబ్‌కలెక్టర్ రాఘవేంద్రమీనా మాట్లాడుతూ ప్రభుత్వం రాయితీపై అందించిన పరికరాలను సద్వినియోగం చేసుకుని అధిక లాభాలను ఆర్జించాలన్నారు. కార్యక్రమంలో వెంకటేశ్వర్లురాజు, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, బిల్లు చెంచురామయ్య, మట్టం శ్రావణి, శ్రీనివాసులురెడ్డి, రాఘవరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, కిషోర్‌నాయుడు, వాటంబేడు శివ కుమార్, జలీల్ అహ్మద్, వ్యవసాయశాఖ ఏడీ గోపినాయక్‌రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారంపై అవగాహన

ఓజిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): తల్లులు తమ గర్భస్థ దశనుంచి పిల్లలకు రెండేళ్ల వయసు వచ్చేవరకు సంరక్షణపై దృష్టి పెట్టాలని కురుగొండలోని ఆయుర్వేద వైద్యురాలు మంజుల అన్నారు. ఓజిలి మండలం కురుగొండలోని ఎస్టీ అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం జరిగిన పౌష్టికాహార పక్షోత్సవాల్లో ఆమె పాల్గొన్నారు. పౌష్టికాహారం, పిల్లల పోషణ, సంరక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు. ఆరోగ్యకరమైన జీవన శైలిని అలవరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్ సుజన, మహిళా సంరక్షణ కార్యదర్శి భారతి, అంగన్‌వాడీ కార్యకర్తలు సుహాసిని, అనూష, రాజేశ్వరి పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన సర్పంచు

ఓజిలి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఓజిలి మండలం చిలమానుచేను సర్పంచు, వైసీపీ నేత పారిచర్ల సాయిరాం మంగళవారం బీజేపీలో చేరారు. బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి సమక్షంలో సర్పంచుతో పాటు దాదాపు 50మంది గ్రామస్తులు బీజేపీలో చేరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిల్లు పవన్ కుమార్, వరప్రసాద్, రవీంద్రరాజు, శేషయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్ల పంపిణీ

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో మంగళవారం అబ్దుల్ కలాం చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ప్రయాణికులకు మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేశారు. రైల్వేస్టేషన్ మేనేజర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ వేసవి కాలంలో రైలు ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ట్రస్ట్ అధ్యక్షుడు తాజుద్దీన్ ముందుకు వచ్చి మజ్జిగ ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు పంపిణీ చేయడం అభినందనీయమన్నారు.

ఆక్రమణల తొలగింపు

గూడూరు అర్బన్, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఐసీఎస్ రోడ్డులోని కోదండ రామాంజనేయస్వామి ఆలయానికి సంబంధించిన స్థలంలో అక్రమంగా నిర్మించిన రేకుల షెడ్డును దేవదాయశాఖ సిబ్బంది మంగళవారం తొలగించారు. ఈ సందర్భంగా ఆలయ ఈవో నవీన్‌కుమార్ మాట్లాడుతూ కోదండ రామాంజనేయస్వామి ఆలయ స్థలంలో కొంత భాగంపై కోర్టు కేసు నడుస్తోందన్నారు. అయితే కొందరు అక్రమణలకు ప్రయత్నించగా పోలీసులకు ఫిర్యాదు చేసి వాటిని తొలగించడం జరిగిందన్నారు.

19న రన్ ఫర్ జీసస్

కోట, ఏప్రిల్ 15: కోట పట్టణం ఎన్‌సీఆర్ నగర్‌లోని బరకా ఆరాధన మందిరంలో మంగళవారం రన్ ఫర్ జీసస్ ఫ్లెక్సీల ఆవిష్కరణ జరిగింది. క్రైస్తవ సంఘాల ఐక్యత, యువతను ఆధ్యాత్మిక మార్గంలో నడిపించడానికి ఈనెల 19న వాకాడు నుంచి కోట క్రాస్ రోడ్డు వరకు రన్ ఫర్ జీసస్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో దినకర్‌బాబు, నోవాబాబు, ప్రభాకర్, రత్నం, శ్యామ సుందర్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సౌకర్యం కల్పించండి

వెంకటగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ పరిధిలోని సీతారామ్ ఏచూరి నగర్‌లో నివాసం ఉంటున్న దళిత, గిరిజన కుటుంబాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దారు రామ్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజయ్య, దొరబాబు, వెంకటయ్య, నాగమణి, నాగరాజు, పెంచలయ్య, ధనలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు

కోట, ఏప్రిల్ 15: కోట దళితవాడలో మంగళవారం తిరుపతిలోని స్విమ్స్ ఆస్పత్రి ఆధ్వర్యంలో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించారు. డాక్టర్ హరిత, డాక్టర్ నాగరాజు, సిబ్బంది సంధ్య, రమేష్ ఆధ్వర్యంలో మహిళలకు మమోగ్రామ్ పరీక్షలు నిర్వహించారు. పలువురికి మందులను పంపిణీ చేశారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న డైరెక్టర్, విభాగాధిపతులు

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని విద్యానగర్ ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో మంగళవారం పలువురు విద్యార్థులను అభినందించారు. ఈ నెల 11 నుంచి 14వ తేదీ వరకు కడపలోని కేఎస్‌ఆర్‌ఎం ఇంజనీరింగ్ కళాశాలలో క్రీడా పోటీలు జరిగాయి. బాస్కెట్ బాల్, కబడ్డీ, బాల్ బాట్మింటన్ పోటీల్లో ఎన్‌బీకేఆర్ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపి బహుమతులు, షీల్డ్‌లు, మెమోంటోలు అందుకున్నారు. వారిని మంగళవారం కళాశాల డైరెక్టర్ డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ మల్లిఖార్జునరెడ్డి, ఆయా విభాగాధిపతులు అభినందించారు.

అశ్వవాహనంపై శ్రీరాముడు

గూడూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కోనేటిమిట్టలోని కోదండ రామాంజనేయస్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలలో భాగంగా మంగళవారం స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఉదయం స్వామి, అమ్మవార్లను విశేషంగా అలంకరించి విశ్వక్సేనా ప్రార్థన, మూర్తి హోమం, బలిహరణ, తిరుచ్చి ఉత్సవం జరిపారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి అశ్వవాహనంపై ఉంచి మంగళవాయిద్యాల నడుమ గ్రామోత్సవం నిర్వహించారు. ఇందిరమ్మ, బాబాప్రసాద్‌రెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి కుటుంబ సభ్యులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

సంగమేశ్వరుడు..

కోట, ఏప్రిల్ 15: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి సంగమేశ్వరుడు, కామాక్షీదేవి అమ్మవార్లు అశ్వవాహనంపై ఊరేగారు. అనంతరం స్వామి, అమ్మవార్లు గూడలి పురవీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగారు. భక్తులు స్వామివారికి అడుగడుగునా కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు.

మున్సిపల్ కార్మికుల ధర్నా

వెంకటగిరి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మున్సిపల్ కార్మికులు తమ సమస్యల పరిష్కారం కోసం మంగళవారం సీఐటీయూ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు వడ్డిపల్లి చెంగయ్య మాట్లాడుతూ కార్మికుల సమస్యల పరిష్కారంలో పాలకులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. కార్మిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేనిపక్షంలో ఆందోళన చేస్తామన్నారు. అనంతరం మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు ప్రసాద్, పెంచలయ్య, సుబ్రహ్మణ్యం, సుబ్బరత్నమ్మ, కిష్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

కనులపండువగా ఈశ్వరయ్యస్వామి తెప్పోత్సవం



పుష్కరిణిలో తెప్పపై విహరిస్తున్న స్వామి, అమ్మవార్లు

డక్కిలి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): ప్రముఖ పుణ్యక్షేత్రమైన దేవునివెల్లంపల్లిలోని స్తంభాలగిరి ఈశ్వరయ్యస్వామి తిరునాళ్లల్లో భాగంగా మంగళవారం రాత్రి శివ పార్వతుల తెప్పోత్సవం కనులపండువగా జరిగింది. మంగళవాయిద్యాలు, మేళతాళాలు, గిరిజ నృత్యాల నడుమ స్వామివారి తేప్పోత్సవం నిర్వహించారు. స్వామి, అమ్మవార్లు కోనేరులో తెప్పపై మూడుసార్లు విహరించారు. అనంతరం చప్పరంపై నుంచి భక్తులకు దర్శనమిచ్చారు.

తిరునాళ్ల రాబడి రూ.7,69,235

స్తంభాలగిరి ఈశ్వరయ్య స్వామి తిరునాళ్లలో మెత్తం రూ.7,69,235 లక్షలు ఆదాయం వచ్చింది. హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకల ద్వారా రూ.3,67,135, ప్రత్యేక దర్శన టికెట్లు ద్వారా రూ.71 వేలు, తలనీలాల టికెట్లు ద్వారా రూ.19,850, స్వామివారి కల్యాణం చదివింపుల ద్వారా రూ.1,20,768, అభిషేకం టికెట్లు ద్వారా రూ.4,750, ఉభయ కట్నాల ద్వారా రూ.45 వేలు, అన్నదాన విరాళాలు రూ.91,840 వేలు ఆదాయం వచ్చినట్లు ఈవో శ్రీనివాసులు నాయుడు తెలిపారు.

నీటితొట్టెలను త్వరితగతిన పూర్తి చేయండి



నీటి తొట్టె పనులను పరిశీలిస్తున్న డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్

చిల్లకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): పశువులు నీళ్ల తాగేందుకు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధిహామీ పథకం కింద నిర్మిస్తున్న నీటి తొట్టెలను త్వరితగతిన పూర్తి చేయాలని డ్వామా పీడీ శ్రీనివాసప్రసాద్ అన్నారు. మంగళవారం మండలంలోని తిప్పగుంటపాళెం గ్రామంలో నిర్మిస్తున్న నీటి తొట్టెలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ మాట్లాడుతూ పశువులు నీళ్ల తాగేందుకు మండలంలో 48 తొట్టెలను నిర్మించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. తొట్టెల నిర్మాణాలను రెండు, మూడు రోజుల్లో పూర్తిచేసేలా సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. ఎండలను దృష్టిలో ఉంచుకుని ఉపాధి పనుల వద్ద కూలీలకు మంచినీరు అందుబాటులో ఉంచాలన్నారు. అనంతరం పారిచెర్లవారిపాళెం వద్ద ఉపాధి పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీడీ చంద్రశేఖర్ రాజు, ఏపీవో గిరిబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

వేడుకగా సీతారాముల కల్యాణం



కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీరామనవమి మహోత్సవాల్లో భాగంగా మన్నారుపోలూరు అలఘు మల్లారి కృష్ణస్వామి ఆలయంలో మంగళవారం సీతారాముల కల్యాణం వేడుకగా జరిగింది. ముందుగా ఆలయ ప్రాంగణంలో ఉన్న రామాలయం ఎదురుగా సీతారాముల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వేదమంత్రాలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాల నడుమ పండు వెన్నెల్లో సీతారాముల కల్యాణం నేత్రానంద శోభితంగా జరిగింది.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు

పెళ్లకూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మండలంలో తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని ఎంపీపీ పోలంరెడ్డి శేఖర్‌రెడ్డి అధికారులకు సూచించారు. మంగళవారం పెళ్లకూరు ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఎంపీపీ మాట్లాడుతూ వేసవి నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి సమస్యపై ఫిర్యాదు అందగానే చర్యలు చేపట్టి పరిష్కరించాలని ఎంపీడీవో ప్రమీలారాణి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులకు సూచించారు. జీలపాటూరు సర్పంచు, ఉమ్మడి నెల్లూరు జిల్లా సర్పంచుల సంఘం అధ్యక్షుడు కందమూడి శివకుమార్ మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వేతో గ్రామాల్లో ఉన్న సమస్యలు పరిష్కారం కాకపోగా మరెన్నో సమస్యలు ఉత్పన్నమయ్యాయని వాపోయారు. రీసర్వే లోపాలను సరి చేయాల్సిన అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండడంతో రైతులు కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారని వాపోయారు. కూటమి ప్రభుత్వం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించినా సమస్యలు పరిష్కారానికి నోచుకోలేదన్నారు. అధికారులు తక్షణం స్పందించి భూసమస్యలను పరిష్కరించాలని కోరారు. అనంతరం దేశంలోని స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులకు హర్యానాలో నిర్వహిస్తున్న వర్క్‌షాప్‌లో పాల్గొని తిరిగి వచ్చిన జడ్పీటీసీ నన్నం ప్రిస్కిల్లాను ప్రజా ప్రతినిధులు, అధికారులు సత్కరించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీలు సుధారాణి, బెల్లపు రవిరెడ్డి, ఏవో ప్రవీణ, సీడీపీవో ఉమామహేశ్వరి, ఎంఈవో మించల శంకరయ్య, హౌసింగ్ ఏఈ వెంకయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు సర్వీసులు పెంచండి

ఆర్ఎంకు ఎమ్మెల్యే వినతి

పిచ్చాటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): త్వరలో పిచ్చాటూరు-పెనాలూరు పేట బస్సు సర్వీసును పునఃప్రారంభిస్తామని ఆర్టీసీ తిరుపతి రీజినల్ మేనేజర్ నరసింహులు చెప్పారు. పిచ్చాటూరులో అధికారుల సమీక్షలో ఉన్న ఎమ్మెల్యేను ఆర్ఎం, సత్యవేడు డిపో మేనేజర్ వెంకటరమణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... సత్యవేడు నుంచి విజయవాడకు, తిరుమలకు ఆర్టీసీ బస్సు సర్వీసులు నడపాలని కోరారు. అలాగే పిచ్చాటూరు, నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్లను అభివృద్ధి చేయాలని కోరారు. సత్యవేడు నుంచి విజయవాడకు నూతన బస్సు సర్వీసును త్వరలో ప్రారంభిస్తామని, ఇందు కోసం కొత్త బస్సును రిజిస్ట్రేషన్ చేయిస్తున్నామని ఆర్ఎం చెప్పారు. ఈనెల 20న సీఎం చంద్రబాబు జన్మదినాన్ని పురస్కరించుకుని రాత్రి 8 గంటలకు సత్యవేడు నుంచి తిరుమలకు బస్సు సర్వీసును ప్రారంభిస్తామని, అలాగే సత్యవేడు నుంచి సంతవేలూరు మీదుగా సూళ్లూరుపేటకు బస్సును ప్రారంభిస్తామని, ఇదే బస్సును లాస్ట్ ట్రిప్పుగా సత్యవేడు నుంచి శ్రీకాళహస్తికి నడపనున్నట్లు చెప్పారు. ఏఎంసీ మాజీ చైర్మన్ ఇళంగోవన్ రెడ్డి, తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు జయచంద్రనాయుడు, వాసురెడ్డి, భక్తారెడ్డి, బి.ఎం.దొరైవేలు, రవి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నాయకులూ... అధికారులను వేధించకండి


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఆదిమూలం

పిచ్చాటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): నాయకులు తీరు మార్చుకుని హుందాగా వ్యవహరించాలని, అధికారులను వేధించడం మానుకోవాలని ఎమ్మెల్యే ఆదిమూలం హితవు పలికారు. పిచ్చాటూరు పట్టణంలోని ఎంకేటీ కల్యాణ మండపంలో మంగళవారం నియోజకవర్గంలోని ఏడు మండలాల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... వాళ్లతెలుసు... వీళ్ల తెలుసని నాయకులు దబాయిస్తే బెదరవద్దని, తాను అధికారులకు అండగా ఉంటానని చెప్పారు. గోకులం షెడ్లు, సబ్సిడీ రుణాలు, పశువుల తాగునీటి తొట్టెలు అర్హత ఉన్న ప్రతి లబ్ధిదారుడికి అందేలా చర్యలు చేపట్టాలని కోరారు. శ్మశనాలు శాంతి వనాలుగా ఉండాలే తప్ప ముళ్ళ చెట్ల మధ్య కాదన్నారు. పిచ్చాటూరు, నారాయణవనం, కేవీబీ పురం, నాగలాపురం, సత్యవేడు, బుచ్చినాయుడు కండ్రిగ మండలాలకు చెందిన ఎంపీడీవోలు, ఏపీవోలు, ఏపీఎంలు, పశు సంవర్థకశాఖ అధికారులు, అన్ని శాఖలకు చెందిన ఇంజనీర్లు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ జాతర ప్రారంభం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీ కాళహస్తీశ్వరాలయానికి అనుబంధ ముత్యాలమ్మ ఆలయంలో మంగళవారం జాతర సంప్రదాయపద్ధతిలో ప్రారంభమైంది. మొదటి రోజు ముత్యాలమ్మకు పాలు, పెరుగు, చందనం, నారికేళ జలం, కలశ జలాలతో అభిషేకాలు నిర్వహించి ప్రత్యేకంగా అలంకరించారు. ధూప, దీప కర్పూర హారతులు సమర్పించారు. అనంతరం భక్తులకు అంబలి ప్రసాదాన్ని పంపిణీ చేశారు. ఉదయం 9గంటలకు యాదవ కులస్థులు ముత్యాలమ్మ, రేణుకమ్మ ఉత్సవ మూర్తులు, పోతురాజును వెంటబెట్టుకుని గెరిగ ఉత్సవం ప్రాంభించారు. వాయిద్యాలు వాయిస్తూ నృత్యాలు చేస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఉదయం మైలు ముగ్గు, రాత్రి 7 గంటలకు శేషపాన్పు ముగ్గు వేశారు. రాత్రి గంగపెట్టెను ఊరేగించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. శ్రీకాళహస్తీశ్వరాలయ డిప్యూటీ ఈవో కృష్ణారెడ్డి, ఏఈవో హేమమాలిని, సూపరింటెండెంట్ రవి, నాగభూషణం యాదవ్, లక్ష్మయ్య, ఆలయ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విద్యాప్రకాశనందగిరి జయంతి


అనుగ్రహ భాషణం చేస్తున్న పీఠాధిపతులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని శుకబ్రహ్మాశ్రమంలో మంగళవారం విద్యాప్రకాశనందగిరి 112వ జయంతిని నిర్వహిం చారు. పీఠాధిపతి విద్యాస్వరూపానంతగిరి అధ్యక్షతన కార్యక్రమం నిర్వహిం చారు. పలు ప్రాంతల నుంచి విచ్చేసిన పీఠాధిపతులను అయన ఘనంగా సత్కరించారు. వారు భక్తులకు అనుగ్రహ భాషణం చేశారు. అనంతరం ఆశ్రమంలో పూజలు నిర్వహించి భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి మాజీ చైర్మన్ అంజూరు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో పాడి గేదెల మృతి

పిచ్చాటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని శేషంపేటకు చెందిన పాడి రైతు రవి తన గేదెలను మంగళవారం ఉదయం మేత కోసం అరణియార్ ప్రాజెక్టు పరిసరాల్లోకి తీసుకెళ్లాడు. మేత మేస్తూ ఉన్న రెండు గేదెలు ఉన్నట్లుండి అరుస్తూ విద్యుదాఘాతంతో మృతి చెందాయి. సోమవారం సాయంత్రం గాలులకు తెగిపడ్డ విద్యుత్ తీగ తగలడంతో మూగ జీవాలు మృత్యువాత పడ్డాయి. కుటుంబ పోషణకు జీవనాధారమైన గేదెలు మృతి చెందడంతో రైతు బోరున విలపించాడు.

మనోవేదనతో వివాహిత ఆత్మహత్య


స్నేహ మృతదేహం

పిచ్చాటూరు, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పిల్లలు లేరని వివాహిత ఆత్మహత్య చేసుకుంది. మండలంలోని కీళపూడి పంచాయతీ అక్కగారిపేటలో మంగళవారం ఈ ఘటన వెలుగు చూసింది. ఎస్ఐ వెంకటేష్ తెలిపిన వివరాల మేరకు.... గుమ్మడిపూండి సమీపంలో బిల్లాకుప్పానికి చెందిన స్నేహ(23)కు ఐదు సంవత్సరాల క్రితం అక్కగారిపేటకు చెందిన జీవరాజ్‌తో వివాహమైంది. కాలం గడుస్తున్నా పిల్లలు కలగలేదని ఆవేదన ఇంట్లో ఒంటరిగా ఉండడంతో మానసిక క్షోభతో ఉరి వేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను కిందకు దించి నగరి ప్రభుత్వాస్పత్రికి తరలించగా వైద్యులు పరిశీలించి మరణించినట్లు ధృవీకరించారు. శవ పంచనామా అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయండి


సభ్యులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

సత్యవేడు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): వార్షిక ప్రణాళిక సర్వేను త్వరగా పూర్తి చేయాలని వెలుగు ఏపీఎం డాంగే యాదవ్ తెలిపారు. మంగళవారం మం డల పరిషత్ కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశంలో అయన మాట్లాడుతూ జీవన ఉపాధులు పెంచే విధంగా వార్షిక ప్రణాళిక రూపొందించాలన్నారు. అలాగే బ్యాంకులో తీసుకున్న లింకేజీ రుణాలను సక్రమంగా చెల్లించాలన్నారు. దీంతో పాటు సీఐఎఫ్, శ్రీనిధి రుణాలను గడువులోగా చెల్లించాలన్నారు. మహిళా రైతు గ్రూపుల ఏర్పాటు వేగవంతం చేయాలని కోరారు. సమావేశంలో వెలుగు కోఆర్డినేటర్లు శివకుమార్, పురుషోత్తం, పుల్లయ్య, వీవో లీడర్లు పాల్గొన్నారు.

అగ్నిప్రమాదాలపై అవగాహన



శ్రీకాళహస్తి, సత్యవేడు పట్టణాల్లో అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఎస్వీ మార్ట్, రైల్వేస్టేషన్ వద్ద అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో అవగాహన కల్పించారు. అనంతరం ప్రయాణికులకు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అగ్నిమాపక అధికారి నాగార్జున రెడ్డి, సిబ్బంది సునీల్‌కుమార్, అమర్‌నాథ్, రాజా, మహేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు (ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదాలపై గృహిణులు అప్రమత్తంగా ఉండాలని సత్యవేడు అగ్ని ప్రమాద కేంద్రం ప్రధాన అధికారి రాజయ్య తెలిపారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా మంగళవారం శ్రీకాళహస్తి బస్టాప్, రిలయన్స్ మార్ట్ వద్ద ఆయిల్, గ్యాస్ ప్రమాదాలు, నివారణ చర్యలపై ప్రయోగాత్మకంగా వివరించారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ప్రసాద్, శ్రీనివాసులు, సుబ్రమణ్యం, నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

రేణిగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో విష్ణు చిరంజీవి కోరారు. మే 10వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

ముక్కంటి భక్తులకు పార్కింగ్ కష్టాలు


స్వర్ణముఖిలో పార్కింగ్ చేసిన వాహనాలు

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): శ్రీకాళ హస్తీశ్వ రాలయానికి సొంత వాహనాల ద్వారా చేరుకునే భక్తులకు పార్కింగ్ ఇక్కట్లు తప్పడం లేదు. జ్ఞాన ప్రసూనాంబ సమేత ముక్కంటి దర్శనానికి రోజు వేలాదిగా భక్తులు తరలి వస్తుంటారు. ఇటీవల దూర ప్రాంతాల భక్తులు ప్రైవేటు వాహనాల ద్వారా ఆలయానికి చేరుకుంటున్నారు. ఈక్రమంలో ముక్కంటి ఆలయం ఆధ్వర్యంలో ప్రైవేటు వాహనాల నుంచి టెండరు దక్కించుకున్న వారు ఎన్నో దశాబ్దాలు పార్కింగ్ వసూలు చేస్తున్నారు. కొద్ది నెలలుగా టెండర్ ప్రక్రియ జరగక పోవడంతో ఆలయ సిబ్బంది పార్కింగ్ లావాదేవీలను నిర్వహిస్తున్నారు. రూ.2 కోట్లకు పైగా పార్కింగ్ ద్వారా ముక్కంటి ఆలయానికి ఆదాయం సమకూరుతోంది. కానీ వాహన దారులకు సరైన స్థానం, సౌకర్యం మాత్రం కల్పించడం లేదు. పార్కింగ్ కోసం నగదు చెల్లించినప్పటికీ ఎలాంటి భద్రత లేకుండా భక్తులు తమ వాహనాలను ఎక్కడ పడితే అక్కడ నిలపాల్సి వస్తోంది. ముక్కంటి ఆలయం తరుపున సరైన పార్కింగ్ కేంద్రం ఇప్పటి వరకు ఏర్పాటు కాలేదు. వేసవిలో స్వర్ణముఖి నదిలో పార్కింగ్ చేసుకోవడం వల్ల ఆలయ పరిసరాల్లోని సన్నిధివీధిలో కొంత మేర ట్రాఫిక్ సమస్య తగ్గు ముఖం పడుతోంది. అయితే వర్షాకాలంలో నదిలోకి నీరు చేరితే సన్నిధి వీధిలో ఎక్కడ పడితే అక్కడ పార్కింగ్ చేసుకోక తప్పని పరిస్థితి. రద్దీ రోజుల్లో సన్నిధి వీధి వాహనాలతో స్తంభించి పోతోంది. ఆలయానికి భారీ ఆదాయాన్ని సమకూరుస్తున్న పార్కింగ్ విభాగానికి భవిష్యత్తు అవసరాల దృష్ట్యా అదే స్థాయిలో ప్రత్యేక పరిస రాలను కేటాయించాల్సి ఉంది. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసు కోవాల్సి ఉంది.

అభివృద్ధి ప్రదాతకు జన నీరాజనం

ఘనంగా బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి




ఊరందూరులో ఎమ్మెల్యే స్వగృహంలో బొజ్జలకు నివాళి అర్పిస్తున్న కుటుంబీకులు - బొజ్జల ఘాట్ వద్ద కుటుంబ సభ్యుల నివాళి - గోపాలకృష్ణారెడ్డి కాలనీలో కేక్ కట్ చేస్తున్న విజయకుమార్

శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తి నియోజకవర్గ అభివృద్ధి ప్రదాతగా జనం గుండెల్లో స్థానం ఏర్పరచుకున్న మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి జయంతి వేడుకను ఘనంగా జరుపుకున్నారు. శ్రీకాళహస్తి మండలం ఊరందూరులోని ఆయన స్వగృహం వద్ద సతీమణి బృందమ్మ, తనయుడు ఎమ్మెల్యే సుధీర్, కోడలు రిషితారెడ్డి ఆధ్వర్యంలో గోపాలకృష్ణారెడ్డికి ఘనంగా నివాళులర్పించారు. గోపాలకృష్ణారెడ్డి ఘాట్ వద్దకు చేరుకుని ప్రత్యేక పూజలు చేసి పుష్పాంజలి ఘటించారు. పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎంజీఎం, అగర్వాల్ ఆస్పత్రుల సంయుక్త ఆధ్వర్యంలో మెగా కంటి వైద్యశిబిరం నిర్వహించారు. శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో రూ.7లక్షలతో సెంట్రల్ ఆర్వో సిస్టమ్‌ను ప్రారంభించారు. త్వరలోనే శ్రీకాళహస్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిని అధునాతన వసతులు కల్పిస్తామని చెప్పారు. మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి ప్రారంభించిన ఉచిత డయాలసిస్ కేంద్రాన్ని మరింతగా అభివృద్ధి చేస్తామన్నారు. అదే విధంగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద, కార్గిల్ సెంటర్ వద్ద, కొత్తపేటలోని బాలికల ఉన్నతపాఠశాల ఎదురుగా బొజ్జల జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాసరం రమేష్ తదితరులు పాల్గొన్నారు. టైలర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో టీడీపీ పట్టణాధ్యక్షుడు విజయకుమార్, అసోసియేషన్ నాయకులు అమర్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు. వైష్ణవ కోనేరు వద్ద జరిగిన వేడుకల్లో మాజీ కౌన్సిలర్ నివేదితామోరె, ఉమేష్‌రావు పాల్గొన్నారు. శ్రీకాళహస్తి మండలం పల్లంపేటలో జరిగే వేడుకల్లో బీజేపీ నాయకులు చంద్రప్ప, టీడీపీ నాయకుడు రాంబాబునాయుడు తదితరులు పాల్గొన్నారు. ఎన్టీఆర్‌నగర్ వద్ద జరిగన కార్యక్రమంలో నెమళ్లూరు బుజ్జి తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమాల్లో బొజ్జలకు నివాళులు అర్పించినవారిలో చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, సూళ్లూరుపేట ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, అధికార ప్రతినిధి గురవారెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శులు గాలి చలపతినాయుడు, దశరథాచారి, తిరుపతి పార్లమెంట్ తెలుగురైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌బాబు, సీనియర్ నాయకులు చెంచయ్యనాయుడు, బొల్లినేని జగన్నాధం నాయుడు, మునిరాజానాయుడు, కంఠా రమేష్, రవీంద్రారెడ్డి, జయచంద్రనాయుడు తదితరులు పాల్గొన్నారు.


కేక్ కట్ చేస్తున్న రాంబాబునాయుడు తదితరులు

శ్రీశైలం దేవస్థానానికి పట్టువస్త్రాల సమర్పణ

రేణిగుంట ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీశైలం భ్రమరాంబ సమేత మల్లిఖార్జున స్వామి ఆలయంలో స్వామిఅమ్మవార్లకు పట్టు వస్త్రాలు, నల్ల గాజులు, పసుపు, కుంకుమను ఏర్పేడు మండలం జంగాలపల్లికి టీడీపీ నైనారు పొన్నారావు కుటుంబ సభ్యులు మంగళవారం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీశైలం ఆలయ ఈవో శ్రీనివాసరావు... పొన్నారావు కుటుంబసభ్యులకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి పట్టువస్త్రాలను అందుకున్నారు. అనంతరం వారికి స్వామిఅమ్మవార్ల దర్శన ఏర్పాట్లు చేసి సత్కరించారు.

కాలబైరవుడి ప్రాకారోత్సవం



శ్రీకాళహస్తి, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న కాలభైరవ స్వామికి మంగళవారం ప్రాకారోత్సవం జరిగింది. ఆలయ అర్చకులు ముందుగా కాలభైరవ స్వామి సన్నిధిని శుద్ధి చేశారు. అనంతరం అభిషేకాలు ధూప, దీప, నైవేద్య, హారతులు సమర్పించారు. కాలభైరవ స్వామి ఉత్సవమూర్తిని విశేషంగా అలంకరించి మహాద్వారం నుంచి విజయ స్తూపం వరకు వెళ్లి అక్కడి నుంచి ప్రదక్షిణగా చేసి తిరిగి ఆలయంలో కొలువు తీర్చారు.

శ్మశానంలో పిచ్చిమొక్కల తొలగింపు



కేవీబీపురం, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని పెరిందేశానికి చెందిన శ్మశానవాటికలో అధికారులు సోమవారం యంత్రాలతో కంపచెట్లను తొలగించారు. సుమారు 680 గడపలున్న పెరిందేశంలో సరైన శ్మశాన వాటిక సమస్యలపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. చివరకు గ్రామస్తులు ఆందోళన చేపట్టడంతో మంగళవారం యంత్రాలతో కంపచెట్లను తొలగించి శ్మశానాన్ని శుభ్రం చేయించారు.

రీ సర్వేకు రైతులు సహకరించాలి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): భూ రీసర్వేకు రైతులు సహకరించాలని తహసీల్దారు శ్రీదేవి కోరారు. మండలంలోని తిమ్మభూపాలపురంలో మంగళవారం రీ సర్వేపై గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తిమ్మభూపాలపురం రెవెన్యూలో 386.78 ఎకరాల డీకేటీ పట్టాలు, 263.60 ఎకరాల పట్టా భూములు, 123.18 ఎకరాల ప్రభుత్వ భూములను రీ సర్వే చేస్తామన్నారు. సర్వే జరిగే సమయంలో రైతులు తగిన పత్రాలతో అందుబాటులో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో డీటీ చంద్రబాబునాయుడు, ఆర్ఐ నల్లయ్య, సర్వేయర్ రాజ్‌కుమార్, వీఆర్వోలు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలను పరిష్కరించండి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలో దీర్ఘకాలికంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించాలని టీడీపీ నాయకులు తహసీల్దారు శ్రీదేవిని కోరారు. ఈ సందర్భంగా టీడీపీ మండల అధ్యక్షుడు సుధాకర్‌నాయుడు మాట్లాడుతూ మండలంలో గత వైసీపీ ప్రభుత్వంలో రెవెన్యూ అధికారుల చర్యలతో రైతులు భూ సమస్యలతో సతమతమవతున్నారని చెప్పారు. ఈ సమస్యలపై లోతైన విచారణ చేపట్టి రైతులకు న్యాయం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాయల సంస్థ మాజీ చైర్మన్ కన్నయ్యనాయుడు, మునిరాజా, చెంచురామనాయుడు, శ్రీనివాసులు, శశియాదవ్, వెంకటేశ్వర్లు, వీరరాఘవులు పాల్గొన్నారు.

6, 7, 8 తరగతుల విలీనం వద్దు



బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాటూరు ప్రాథమిక ఉన్నత పాఠశాలలో 6, 7, 8వ తరగతులను విలీనం చేయవద్దని గ్రామస్తులు పాఠశాల ప్రధాన గేటు వద్ద మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... తమ గ్రామం నుంచి పల్లమాల ఉన్నత పాఠశాలలో 6, 7, 8 తరగతులను విలీనం చేస్తే విద్యార్థులు ఇబ్బంది పడతారన్నారు. సుమారు 5 కిలోమీటర్ల మేర విద్యార్థులు రాకపోకలు సాగించాల్సి వస్తుందన్నారు. ప్రస్తుతం పాఠశాలలో 115మంది పిల్లలున్నారని 6,7,8 తరగతులు తరలిస్తే కేవలం పాఠశాలలో 50మందే మిగులుతారన్నారు. తమ గ్రామంలో ఉన్నత పాఠశాలను ఏర్పాటు చేయాలని అందుకు కావాల్సిన నిధులు కూడా తామే సమకూర్చుకుంటామని తెలిపారు.

రుణాలతో జీవనోపాధి

బుచ్చినాయుడుకండ్రిగ, ఏప్రిల్ 15(ఆంధ్రజ్యోతి): బ్యాంకుల నుంచి, శ్రీనిధి నుంచి తీసుకున్న రుణాలను స్వయం సహాయక సంఘాల సభ్యులు సద్వినియోగం చేసుకోవాలని వెలుగు ఏపీఎం మునెయ్య తెలిపారు. మండలకేంద్రంలోని వెలుగు కార్యాలయంలో మండల మహిళా సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మునెయ్య మాట్లాడుతూ... ప్రస్తుత ఆర్థిక సంఘంలో మహిళా సంఘాల వారీగా ఏయే రుణాలు వస్తాయో ప్రకటించారు. రుణాలను సద్వినియోగం చేసుకునే విధంగా సంఘమిత్రలు, గ్రామసమాఖ్య లీడర్లు సభ్యులకు అవగాహన కల్పించాలన్నారు.

మరమ్మతులకు గురై ఆగిన ఆర్టీసీ బస్సు



రేణిగుంట, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): ప్రయాణికులతో వెళ్తున్న ఆర్టీసీ బస్సు మరమ్మతులకు గురై ఆగిపోవడంతో ప్రయాణికులు ఇబ్బంది పడ్డారు. మంగళవారం మధ్యాహ్నం సూళ్లూరుపేట డిపో బస్సు తిరుపతి నుంచి సూళ్లూరుపేటకు ప్రయాణికులతో వెళ్తుండగా రేణిగుంట పట్టణంలోని వైఎస్ విగ్రహం వద్ద ఆగిపోయింది. దీంతో కండక్టర్ వెనుక వచ్చే బస్సులో వెళ్లాలని ప్రయాణికులను కోరగా వారు అసహనం వ్యక్తం చేశారు. మిట్ట మధ్యాహ్నం మరో బస్సు మారాలంటే ఎలా అని నిలదీశారు. చేసేది లేక గంట పాటు వేచి ఉండి మరో బస్సులో గమ్యస్థానాలకు బయలు దేరారు.